Sri Subramanyeswara
KISHORE NOVELTIES
Governorpet, Gopala Reddy Road
VIJAYAWADA-520 002

250

# చెట్టూ – ఛాయా

"ఒరే రమణా! నిన్ను కని, పెంచి, ఇంత వాడిని చేసింది నీ నుంచి నీతిబోధలూ, ధర్మ పన్నాలూ వినడానిక్కాదురా!" శివమెత్తిపోతూ పైపంచె గట్టిగా ఝాడించి మఱలా భుజాన పడ వేసుకున్నాడు దేవయ్య!

అటునుంచి సమాధానం వినరాకపోవడంతో మరింత బిగ్గరగా అరవడం ప్రారంభించాడు.

"స్కూళ్ళకూ, కాలేజీలకూ, పుస్తకాలకూ, హాస్టళ్ళకూ వేలకువేలు గుప్పానురా, కొంపా గోడూ గుల్ల జేసుకొని.

ఎందుకు ? ఎందుకంటావ్ ? కన్నవాళ్ళని ఉద్ధరిస్తావని ! నా భుజాలమీది బరువు దింపుతావని ? అంతేకాని, ఎవతెనో ఉద్ధరించి, దాని అమ్మానాన్నల బాధ్యతల బరువును తేలిక చేస్తావని కాదు. తెలిసిందా ?"

గదిలో కిమ్మనకుండా కూర్చున్న రమణ ఈసారి ఏమీ మాట్లాడలేదు.

ఈసారి గాలివాటం మరోవైపుకు తిరిగింది.

"ఏమేవ్, ఓ మహాలక్ష్మి ! చెప్పుకో, నీ ముద్దుల పెద్దకొడుక్కి, సాయంత్రంలోగా నాకు సమాధానం సిద్ధంగా వుండాలని, ఆఁ!"

మరోసారి కండువా జోరుగా దులిపి పైన వేసుకుని, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

"అమ్మా, నేను నా స్నేహితురాలింటికి వెళ్తున్నాను. ఓ గంటలో వచ్చేస్తాను." సుగుణ సుడిగాలిలా వంటగదిలో ప్రవేశించి, తుఫాను వేగంతో మాట్లాడుతోంది.

"ఏ స్నేహితురాలు ?"

"సీత యింటికి. దానికీ వాళ పెళ్ళిచూపులు."

"అయితే మనకేం జరిగింది ? చాల్లే సంబడం. నిన్నూ చూచుకు వెళ్ళారు రెండు సంబంధాల వాళ్ళు. మళ్ళీ ఉత్తర మైనా రాయలేదు." ఈసడించింది మహాలక్ష్మి.

"అది నా తప్పుకాదు, మీ అసమర్థత !" ఛెళ్ళున కొట్టినట్లు మాట్లాడటం సుగుణ సహజగుణం.

"వాళ్ళడిగినవి మీరివ్వ లేకపోతున్నారు, అంతే. నన్నంటా వెందుకు ?"

"ద్రాక్షారం వాళ్ళు మన కందుబాటులోనే వున్నారు కదా ? వద్దు పొమ్మంటివి !"

"ఛీ, ఆ ముష్టి సంబంధం నేను చేసుకోను" ఖరారుగా అన్నది సుగుణ.

"ఆఁ దిగి వస్తాడు, చంద్రలోకంలో నుంచి రాకుమారుడెవరో నీ కోసం. తలకుమాలిన ఆశలు పెట్టుకో కూడదు."

"ఈ గోల రోజూ వుండేదేకానీ నన్ను వెళ్ళనీ."

"త్వరగా రా, మీ నాన్నగారు వచ్చేలోగా. లేకుంటే కోపం వస్తుంది" వెనకనుంచి హెచ్చరిస్తోన్న మహాలక్ష్మి, మూడో కొడుకు రామం పిలవటంతో వెనక్కి తిరిగింది.

"అమ్మా, నా ఎక్స్కర్షన్ మాటేం చేసావ్ ?"

విసిగిపోయి వున్న మహాలక్ష్మి తారాజువ్వలా లేచింది. "అమ్మా అదేం చేశావ్, అమ్మా ఇదేం చేశావ్ ? ప్రతి ఒక్కళ్ళూ నన్నుపీక్కుతినేవాళ్ళే. ఆయన ఎదుట నోరు లేవదు, ఒక్కళ్ళకూ. ఎక్కడినుంచి తేను నాలుగొందలు యిప్పుడు?"

"ఏమో నాకేం తెలుసు ? సాటి వాళ్ళందరికీ వాళ్ళమ్మానాన్నలు నాలుగొంద లడిగితే అయిదొందలిచ్చి పంపుతున్నారు." ఉక్రోషంతో రాము ముక్కుపుటాలు అదురుతున్నాయి.

"తేరగా వచ్చిన రాసులుంటే యిస్తారు. మనకా

పోకులన్నీ అక్కర్లేదు కానీ, నాలుగు అక్షరం ముక్కలు వంటపట్టి డిగ్రీ వస్తేచాలు. వెళ్ళు, మాటి మాటికీ డబ్బో డబ్బో అని పీక్కు తినకు."

"ఛీ ఛీ, చిన్న చిన్న సరదాలు కూడా తీర్చలేని వాళ్ళు పిల్లల్నెందుక్కంటారో" మనసులోని కోపమంతా కాలి బూట్ల ద్వారా ధ్వనింపజేస్తూ అసంతృప్తిగా వెళ్ళి పోయాడు రామం.

"అనండిరా, అనండి." ముక్కు చీదుతూ, తనలో తాను అనుకుంటున్నట్లుగా ఇల్లంతా విన్పించేంత స్వరంతో అంటోంది మహాలక్ష్మి, "ఈ నాటికి మమ్మల్నే వాళ్ళయ్యారు, గుడ్డొచ్చి పిల్ల నెక్కిరించినట్లుగా. దేశంమీద అందరి పిల్లలూ ఇలాగే వున్నారా ? ఎంతెంత కష్టాలు అందుకుంటున్నారు ? ఎంతెంత సాయంగా వుంటున్నారు తలిదండ్రులకు ? మా ఖర్మకొద్దీ మాకు పుట్టినాళ్ళు మమ్మల్ని ఎదురు సతాయించుతున్నారు..."

అనర్గళంగా సాగిపోతోంది ఉపన్యాసం.

ఊపిరి తిరగనట్లున్న ఆ వాతావరణం నుండి సవ్వడి కాకుండా బయటకు అడుగు పెట్టాడు రమణారావు.

ముంగిటవున్న చిన్న అరుగుపై కూర్చుని పధ్నాలు గేళ్ళ చెల్లెలు రాధ ఎదుటి భాగ్యవంతుల మేడనూ, వారి యింటికి వస్తూ పోతూవున్న కార్లనూ ఆశగా, ఆరాధనగా చూస్తోంది.

మూగగా నిశ్వసించింది రమణ మనస్సు. 'ఈ యింట పెద్దలూ, పిన్నలూ ప్రతి ఒక్కరికీ అసంతృప్తి బాధే; ఇంకా ఏదేదో లభించలేదు—ఏమేమో జరగలేదు అనే దిగులే.'

ఇటువంటి చికాకులతో కూడిన దైనందిన జీవితానికి ఊహ తెలిసిన నాటినుండీ అలవాటు పడివున్నా నేడు మరీ వికలమైనది రమణ మనసు

నదీతీరాన ఒంటరిగా గడిపాడు చాలాసేపు.

మనశ్శాంతి చిక్కలేదు.

కడకు ఒక స్థిరనిశ్చయంతో బయలుదేరాడు.

"రా రమణా, నీ కోసమే ఎదురు చూస్తూన్నా." ఛాయ సాదరంగా ఆహ్వానించింది.

"ఏమిటంత గంభీరంగా వున్నావ్?" అన్నది తాను ఓ కుర్చీలో కూర్చుంటూ.

ఛాయ మరి ఆ ప్రశ్నను రెట్టించలేదు.

ఆమెలోని ఆ గొప్ప మర్యాద లక్షణాలపై అతనికి ఎనలేని గౌరవం. గొప్ప మేనర్స్. ఎన్నడూ ఇతరులను ఇబ్బంది పెట్టే సంభాషణ సాగించదు.

"వాతావరణం చాలా బాగుందికదూ ఈ సాయంత్రం!" అంటూ సంభాషణను మార్చింది.

"ఔను, మీ నాన్నగారు ఇంట్లో లేరా?"

"అదుగో, మాటల్లో వచ్చేశారు" అన్నది వీధిద్వారం వేపు చూస్తూ.

"హల్లో రమణా, రెండ్రోజులుగా రాలేదే ఇటు? ఖులాసాయేనా!" - వెంకటేశ్వర్రావు ఆదరంగా అడిగాడు ప్రక్కనే కూర్చుంటూ.

"ఏవో పనులు..." నసిగాడు రమణ.

లోనుండి కామాక్షి వచ్చింది కాఫీ ఫలహారాలతో; కుశల ప్రశ్నలడుగుతూ అక్కడే కూర్చున్నది.

ఆ మర్యాదలకూ ఆప్యాయతకూ రమణ కరిగిపోతాడు.

"మీ చెల్లెలికి సంబంధం వచ్చిందట. కుదిరిందా? ఆ హడావుడిలోనే నువ్వు రావటం లేదేమో ననుకున్నాను."

"హడావుడి ఏముందిలెండి? చూచుకుని వెళ్ళారు. వాళ్ళడిగిన ముప్పైవేలూ మనం యిచ్చిన నాడు పెళ్ళి కాగలదు అంతే."

"అంత పెద్ద మొత్తమే!" ఆశ్చర్యం ప్రకటించింది.

వెంకటేశ్వరరావు అన్నాడు "నీ కది పెద్ద మొత్తంగా అన్పించవచ్చు కానీ ఈనాడు అది చాలా చిన్న అంకె పెళ్ళి బేరాలలో."

"ఏమో బాబూ! తేరగా వచ్చిన ధనరాసులున్న వాళ్లూ, ఒక్కతే పిల్ల వున్నవాళ్లూ యివ్వగలరు కానీ, ఎవ రివ్వగలరు?"

"మనకూ ఒక్క తేపిల్ల, అయితే, మనం యివ్వగలమా మరి ?" అంటూ నవ్వాడు వెంకటేశ్వరరావు.

కామాక్షికి సమాధానం దొరకలేదు.

"అదంతే కామాక్షి, ఈ ప్రపంచం చాలా చిత్రమైనది మనవంటి వాళ్ళకు."

ఆ తర్వాత ఏ ఏ కులాలలో ఎంతెంత కట్నాలు పలుకుతున్నదీ, ఏ ఉద్యోగమైతే ఎంత కట్నం వస్తున్నదీ వగైరా విషయాలపై కొంతసేపు మాటలు సాగిపోయాయి.

"బజార్లోపనుంది. నేను వెళ్తాను మరి" అని వెళ్ళిపోయాడు వెంకటేశ్వరరావు. "వస్తూండవోయ్ రమణా, నువ్వు రాకపోతే ఏమిటో తోచదు." అని హెచ్చరించాడు వెళ్ళేముందు.

"నేను వంటచేసుకుంటానిక. మీరు ఎక్కడైనా షికారు వెళ్తే వెళ్ళిరండి. ఈ రోజు నీ భోజనం ఇక్కడే రమణా." అని వంట యింట్లోకి నిష్క్రమించింది కామాక్షి.

"భోజనం యిక్కడ చేయను లెండి వెళ్ళాలి."

"అప్పటి సంగతి చూద్దాంలే." ఛాయ నవ్వింది.

"ఏమిటో చాలా ఉదాసీనంగా వున్నావీ రోజు? ఈ అందమైన వాతావరణంలో ఎక్కడైనా వెళ్ళాలని అన్పించడం లేదూ నీకు ?"

నిర్లిప్తంగా చిరుహాసం చేశాడు రమణ.

"మానసిక నైర్మల్యమూ, సౌందర్యమూ కలవారే

బాహ్య ప్రకృతినీ, దాని అందచందాలనూ ఆస్వాదించ గలరు ఛాయా !"

ఛాయ తలెత్తి నిశితంగా చూచిందతని దెస.

"రమణా! ఏమిటి అదోలా వున్నావ్? ఎందుకో బాధ పడ్తూన్నట్లు కన్పిస్తున్నావ్ ?"

"ఊఁ, నీతో కొంచం మాట్లాడాలి ఛాయా."

"పద, డాబామీద కూర్చుందాం."

కొంత తడవు తనలో తాను మధనపడుతూ మౌనంగా కూర్చున్న రమణ కడకు సూటిగా చెప్పేశాడు తన నిర్ణయాన్ని.

"మనం ఏవో ఆశలతో భవిష్యత్తును గురించి కలలు కన్నాం. కానీ అవి కలలుగానే మిగిలిపోతాయి ఛాయా !"

తల వాల్చుకు వింటున్న ఛాయ పిడుగుపాటుకు అదరి పడినట్లుగా తలెత్తింది చివాలున. అతడి దెస చూస్తూన్న ఆమె కనుపాపలు అతిగా చలించుతున్నాయి-ఎన్నో ప్రశ్నలు అడుగుతూ.

అపరాధిలా తల వాల్చుకున్నాడు రమణ.

అయిదు నిముషాలు మౌనం రాజ్యమేలింది.

ఆ మౌనాన్ని ఛేదిస్తూ ఛాయ బలమైన నిట్టూర్పు విన వచ్చింది.

"క్షమించు ఛాయా. నేను నిస్సహాయుడను."

ఛాయ హుందాగా తల పంకించింది.

"క్షమా, కోపం వంటి మాటలు మన నడుమ లేవు రమణా. ఏమిటో వివరంగా చెప్పు నాకు విషయాన్ని." అతి నిబ్బరంగా అడిగింది.

స్వగృహ కలహాలనూ, అశాంతినీ వర్ణించుతూ ఆఖరున అన్నాడు రమణ: "ఇటువంటి కుటుంబంలోనికి నిన్ను తీసుకు వెళ్ళడం వలన నీవూ నేనూకూడ అశాంతినే వరించిన వాళ్ళ మౌతాము."

"......"

"మాట్లాడు ఛాయా."

"ఏం మాట్లాడను? నీవు కేవలం నీ పక్షంగానే ఆలోచించావు. మనసున్న మగనితో మహారణ్యం మధ్యనైనా మహానందంగా గడపగల మగువలున్నారని మఱచిపోయావు. అశాంతీ,అసంతృప్తీ ఈఛాయ నిఘంటువులోనే లేవు రమణా!" ఆత్మధైర్యంతో మెరుస్తున్నాయి ఆమె నేత్రాలు.

"ఆ రెండు సుగుణాలూ నీలో కలకాలం నిలచి వుండాలని ఆశీర్వదిస్తున్నాను ఛాయా. గుర్తింపులేని తావున నీవంటి గుణవతిని బంధించకూడదనే నిర్ణయించుకున్నాను."

"రమణా. మన మిద్దరం ఎమ్మెస్సీ పాసయ్యాం. ఇద్దరమూ ఏడెనిమిది వందలు సంపాదిస్తున్నాం. ఇక భయం దేనికి? ఒకరి జీతం ఖర్చుచేయకుండా అట్టే పెట్టి మీ చెల్లెలి పెళ్ళి జరిపించలేమూ?"

"మా యింటి పద్ధతులూ, ఇంట్లో వారి స్వభావాలూ నీకు కూలంకషంగా తెలియవు. దానా పెట్టి మేపుతున్నాం గనుక గేదెపాలన్నీ దూడకుకూడా చుక్క మిగల్చకుండా మనమే తాగాలనుకుంటుంది మా అమ్మ. నా ఉగ్గుపాలకు అయిన ఖర్చులు కూడా వడ్డీతో సహా లెక్క వేసి వుంచాడు మా నాన్న. కేవలం తమ ఆశలూ, ఆదేశాలూ వినడానికీ తీర్చడానికే ఈ 'అన్న' అనే పదార్థాన్ని ప్రసాదించాడని తమ్ముళ్ళూ, చెల్లెళ్లూ గట్టి నమ్మకంతో వున్నారు."

మౌనంగా అన్నీ విన్న ఛాయ చాలాసేపు ఆలోచించింది.

"నీకు కట్నం కావాలంటావ్?" అన్నది హఠాత్తుగా తలెత్తి.

నిశ్చలంగా ఆకసం దెస చూస్తూన్న రమణ నుండి జవాబులేదు.

"రమణా!" స్థిరగంభీరత్వం తావుచేసుకున్నది ఛాయ స్వరంలో.

"రమణా! ఎవరి జీవితం వాళ్ళది; ఎవరి కుటుంబ పరిస్థితులు వాళ్ళవి. అందులో ఇతరుల ప్రమేయమూ, సలహాలూ వెగటుగా విన్పిస్తాయి; అసహ్యంగా కన్పించుతాయి. నీ జీవితంతో నా జీవితం ముడిపడనంత వఱకూ నీకు నేను పరాయిదాన్నే. పరాయి వ్యక్తిగా నిన్ను నేను మొగ

మాటాలతోనూ బలంవంతాలతోనూ బంధించేంత అల్పు రాలనుకాను..."

"ఛాయా!..."

"నన్ను మాట్లాడనీయి రమణా! జననీ జనకులనూ, సోదరీ సోదరులనూ ఉద్ధరించాలనేది సమంజసం కాని విషయ మేమీకాదు. కానీ హద్దులు దాటరాదని నా ఉద్దేశ్యం. ఎవరి ప్రాణం వారికి తీపి— అలాగే ఎవరి జీవితపు బాధ్యత వారిది. త్యాగసముద్రంలో స్వయంగా కొట్టుకు పోవడమనేది నేను హర్షించలేని విషయం."

"అందరి తలిదండ్రులూ నీ తలిదండ్రులలాగ సంస్కార హృదయులై ఉండరు ఛాయా. నీవు అదృష్టవంతురాలివి. సమస్యలులేని అందమైన కుటుంబంలోని నీవు ఆలోచించి నట్లుగా నన్ను నా కాళ్ళ సంకెళ్ళు ఆలోచించనీయవు !"

ఆ మాటలకు బాధపడ్డట్టు చూచింది ఛాయ.

"ఈ పుడమిపై పుట్టిన ప్రతివారికీ ఏవో ఓ సంకెళ్ళు వుండనే వుంటాయి. అయితే, ఆ సంకెళ్ళ ప్రభావానికి లోను గాకుండా 'నేను విద్యావతిని, ఉద్యోగం చేస్తూ లోకం పోకడను గ్రహించిన దాన్ని' అనే విషయాన్ని విస్మరించ కుండా ఆలోచించగలవారే వివేకవంతులు ... నేను తల్లిదం డ్రుల ఏకైక సంతానాన్ని, అందుకే ఇల్లరికపు టల్లుడు కావాలని వాళ్ళు కోరుకుంటున్నారు. కన్నవాళ్ళకు ఏదో ఆశ వుండటం అసహజమేమీ కాదు-కానీ కేవలం తమ పరంగానే

ఆలోచిస్తున్నారు కానీ, పరగృహవాసం పరపురుషుని అహంపై, పౌరుషంపై గట్టి దెబ్బ తీస్తుందనే సంగతి వాళ్ళు మఱచిపోతున్నారు. తలిదండ్రుల యిష్టాలకు గుడ్డిగా ఆమోదం తెలుపలేని నేను 'జీవితం నాది' అనే సత్యాన్ని మనసున వుంచుకొని నిర్ణయాలు తీసుకుంటాను. అందుకే చెప్పేశాను. ఇల్లరికపు సంబంధం నాకవసరం లేదని."

"........."

"సారీ రమణా, చాలా పెద్ద ఉపన్యాసమే యిచ్చాననుకుంటాను. నేను చెప్పేది ఒకటే. మనం విద్యావంతులుగా కొన్ని ఆదర్శాలను పెంచుకున్నాం. ఏ ఆదర్శాన్నైనా అమలు జరపటానికి తెగువ అవసరం."

"నిజమే ఛాయా." నూతిలోనుండి వినవచ్చినట్లున్నది రమణ స్వరం. "నేను పిరికివాడిని."

"క్షమించు. నా మాటల అంతరార్థం అటువంటి నిందకాదు ... సరే, నువ్వు నేడు ఏదో వివశతలో వున్నావ్. వివశత వివేకాన్ని హరింపజేస్తుంది. అందుకే నేను ఆవేశపడడంలేదు. నీ కోసం నేను మరి కొంతకాలం ఓర్పుగా వేచి వుండగలను."

"వద్దు ఛాయా, ఆశ పెరిగిన కొలదీ మనసు రోదించ నలసి వుంటుంది. మన జీవితాలు సమానాంతర రేఖలు అని గుర్తించాక ఇక ఈ ప్రకరణం యింతటితో ముగించటం మంచిది."

వేదాంతిలా చిరుహాసం చేసింది ఛాయ.

"నూరేళ్ళ జీవితాన్ని గురించిన నిర్ణయం నూరు లిప్తల కాలంలో తీసుకోవడం వివేకవంతుల లక్షణం కాదు. వెళ్ళిరా, శాంతంగా ఆలోచించు."

## 2

"అమ్మ భోజనానికి పిలుస్తూంది." ముక్తసరిగా అన్నది పెద్ద చెల్లెలు సుగుణ.

"నాకు ఆకలిలేదు సుగుణా, మీరు కానీయండి." అంటూ పుస్తకాలు ముందు వేసుకు్కూర్చున్నాడు రమణ.

వింటూనే తారామండలాని కెగసిపడ్డాడు దేవయ్య. "ఏం, ఉపవాసాలతో ఎవర్ని బెదరిస్తాడటా? వచ్చి నోరు మూసుకు తినమను."

ఈ ఆదేశం వింటూనే రమణ నిదానంగా లేచివచ్చి వంట యింటి ద్వారంలో నిలబడ్డాడు.

భోజనాలకు సిద్ధంగా కూర్చుని వున్నారు కుటుంబ సభ్యులంతా వరుసగా.

తల్లి వడ్డనల కుపక్రమించింది. ఓ ప్రక్కనుండి. కుమారుని గమనించినట్లే.

"నాకు ఆకలిలేదమ్మా. మీరంతా కానీయండి." అన్నాడు రమణ అతి సహజ స్వరాన.

భోజనాని కుపక్రమించ బోతున్న దేవయ్య కంచు గ్లాసు ఠక్కున నేలన కొడుతూ కౌశిక మహర్షివలె తలెత్తి చూచాడు భస్మం చేసే చూపులతో.

"నీ తీరేమిటో నా కర్థంకాకుండా వున్నది. దేనికీ సమాధానం చెప్పవ్. పైగా తిండివద్దు. నీళ్ళు వద్దు. ఎవర్ని బెదరించాలని? ఏమి సాధించాలని? కన్నవాళ్ళం—కాస్త అది కాదు—ఇదీ—అని చెప్పడం ఓ నేరమేనా? ఇంత ఖర్చుపెట్టి నిన్నింత వాడిని చేసింది ఎందు కనుకున్నావ్?"

ఇప్పటికీ సహనం కోల్పోలేదు రమణ.

"తెలుసు. మీ ఆశలు తీర్చుతానని యింతవాడిని చేశారు. మాట యిస్తున్నాను - మీ బాధ్యతల్ని పెద్ద కొడుకుగా భుజాన వేసుకుంటున్నాను. సుగుణకు ఆ సంబంధం ఖాయం చేయండి. కట్నం ముప్ఫైవేలూ నేను సమకూర్చుతాను. లగ్నాలు పెట్టించండి."

ఆశ్చర్యంగా ఆనందంగా ఒకేసారి అడిగారు తల్లీ తండ్రీ. "అయితే నీకు ఆ విజయవాడ సంబంధం ఖాయం చేయమంటావా? వాళ్ళిచ్చే ముప్ఫైఅయిదు వేలూ మనం ఇలా సర్దేయవచ్చు."

"వద్దు." కఠినంగా, స్థిరంగా అన్నాడు రమణ.

"నేను ప్రస్తుతం వివాహం చేసుకోవటంలేదు. నా పెళ్ళి మాట తలపెట్టవద్దు."

"మరి డబ్బు?"

"నేను తెస్తాను."

"ఎలాగ"

"నాకు చేతులూ కాళ్ళూ వున్నాయి. మీరు పైసా పైసా కూడబెట్టి చదివించిన చదువు వున్నది. చచ్చి సంపాదించైనా తెస్తాను కానీ చెడిపోను. మీరు నిశ్చింతగా వుండండి."

## 3

"పెళ్ళి చాలా బాగా జరిగింది రమణా!" పెళ్ళికి వచ్చిన ఛాయ అభినందన తెల్పింది.

నిర్వికారంగా, నిర్లిప్తంగా అన్నాడు రమణ.

"పెళ్ళికి ఖర్చైన ముప్పైఅయిదు వేలూ మాత్రం బాగుండలేదూ ?"

"ఆఁ!" చాలా ఆశ్చర్యమైంది ఛాయకు.

"ఔను, బాగా చదువుకున్నవాడూ, ధనవంతుడూ

కూడా అయివుండాలి తన భర్త అని సుగుణ పట్టు. కుమార్తె కోరిక కన్నవారికి ముఖ్యం. కొడుకెలా ఏడిస్తే నేం!"

"మరి? ఎలా యింత డబ్బు...?"

"అయిదు ట్యూషన్స్ ఒప్పుకున్నాను. స్కూలు పుస్తకాల గైడ్స్ వ్రాయటానికి ఒక పబ్లిషర్‌తో ఒప్పందం చేసుకున్నాను. నా జీతంమీద, ప్రావిడెంట్ ఫండ్ మీదా అప్పుచేశాను. కన్నవారు నన్ను కనడం వ్యర్థమైనదని బాధ పడకుండా చేశాను."

అతడి కంఠంలో సుడులు తిరుగుతూన్న బాధ ఆమెను మరి మాటలు పొడిగించనీయలేదు.

"చాలా సాహసం చేశావ్ రమణా! ఈ అప్పులు ఎప్పటికి తీరతాయి." అతడి దగ్గర స్నేహితుడైన ప్రభాకరం అడిగాడు.

నిర్జీవమైన చిరుహాసమే సమాధానమైంది రమణ నుండి.

## 4

"మార్నింగ్ రెండు ట్యూషన్స్ చెప్పి కాలేజీకి వస్తున్నావ్. కాలేజి వదలుతూనే మరో మూడు ట్యూషన్స్.

రాత్రంతా కూర్చుని పుస్తకాలు వ్రాస్తావ్, ఇక నీకు విశ్రాంతి ఎప్పుడు!"

విచారంగా అడిగింది ఛాయ ఒకనాడు.

"నాలాటి వాడు విశ్రాంతిగా ఎలా వుండగలడు?" ఎదురుప్రశ్న వేశాడు.

"నీ ఆరోగ్యం గురించి నాకు చింతగా వుంది రమణా."

"నా గురించి ఆలోచించడం మానివెయ్యి ఛాయా."

"మీ అమ్మగారైనా నీ ఆరోగ్యం గురించి హెచ్చరించడం లేదా?"

"హుఁ! అమ్మ!" హేళనగా నవ్వాడు. "ఈ ఉదయం నాకు లేస్తూనే హెచ్చరిక ఇచ్చింది. సుగుణ పురిటికి వస్తుందిట వచ్చే నెలలో. వేడుకలూ వగైరాలకూ, పుట్ట బోయే బిడ్డకు ఇవ్వాల్సిన నగలూ, వియ్యాల వారికి బట్టలూ వెరసి మూడు వేలకు తక్కువ కాదట. ఇప్పట్నుంచీ సమకూర్చి వుంచమని ఆజ్ఞాపించింది. చిన్న చెల్లెలు రాధకుకూడా సంబంధాలు చూడాలని ఆజ్ఞాపించింది."

నిశ్చలంగా నేలవేపు చూస్తున్న ఛాయ మాట్లాడ లేదు.

"ఏం? ఇలాంటి అమ్మలు కూడా వుంటారా అని ఆలోచిస్తున్నావా?"

నిట్టూర్చింది ఛాయ. "రమణా ! నీతో ఎన్నో మాట్లాడాలని వున్నది. కానీ నీతో మాట్లాడడానికే భయంగా వుండేంత గంభీరంగా మారిపోతున్నావ్, నువ్వు ఏనాటి కానాడు"

"నువ్వు మాట్లాడదలుచుకున్న దేమిటో తెలుసు."

"మరి ?"

"కానీ, ఆ మాటలు ఇక అనవసరం ఛాయా, ఒకప్పుడు ఏదో అనుకున్నాం, అది మరిచిపో. ఇప్పుడు మన జీవితాలు వేరు."

"రమణా !"

"ఔను, మరో చెల్లెలు పెళ్ళి—మరో నల్భై వేలు కావాలి. తమ్ముళ్ళ చదువులు— వీటికే నేను అంకితం. భార్యా పిల్లలు అనవసరం నావంటి వాడికి. వాళ్ళను ఏడిపించలేను."

"రమణా ! ఒక్క మాట నేను చెప్తే కోపం రాదు కదా ?"

"ఏమిటి ?"

"ఒక చెల్లెలి బాధ్యత నీవు నిర్వర్తించావ్. మరొకామె బాధ్యతను మీా పెద్ద తమ్ముడు తీసుకోవడం న్యాయం. ఏం తొందర వచ్చిందిప్పుడు రాధ పెళ్ళికి ? పదిహేనేళ్ళేగా ఆమెకు ? అప్పటికి మీా పెద్ద తమ్ముడు ఉద్యోగంలో స్థిర పడ్తాడు."

"హుఁ. వాడు నావంటి వాడు కాడు. రాజు తన

స్వార్థమే తనదిగా భావిస్తాడని అమ్మకు బాగా తెలుసు. అందుకే లాగే ఎద్దునే మరింత ముల్లు గఱ్ఱతో పొడుస్తోంది."

"ఆవిడ స్వార్థం తెలిసీ నువ్వు నన్ను త్యాగం చేసుకుంటున్నావా రమణా ?"

"........."

"నన్ను వదలుకోడం నీకు బాధగా లేదా రమణా ! ఎంతకాలం వేచివుండను ?"

ఆఖరి అస్త్రం ప్రయోగించింది.

అయితే, ఈ బాణం కూడా అతడిపై పనిచేయలేదు.

"నిన్ను వదలుకోవడం ఎంత బాధాకరమై నన్ను తినివేస్తుందో వర్ణించ నక్కరలేదు — వర్ణించలేను, కారణం అదికూడా కవిత్వంలోనికే లెక్క వస్తుంది. పరాయి స్త్రీపై కవిత్వాలల్లే నీచస్థితికి దిగజారలేను."

బాధగా చూచిన ఛాయ, భారంగా నిట్టూర్చింది.

"ఇదే నీ ఆఖరి నిర్ణయమా రమణా ?"

"ఔను, ఈ బలహీనుడిని మఱచిపోయి, చక్కని వ్యక్తిని వివాహమాడి కళ కళ లాడుతూ జీవించు. ఆ పెళ్ళికి నన్ను పిలవడం మఱచిపోకు."

"మంచిది. థాంక్స్. సెలవ్" ఛాయ కంఠంలో దుఃఖంతోపాటు క్రోధంకూడా పలికినట్లు తోచింది రమణకు.

అతడి కనులలో రెండు అశ్రుబిందువులు నిలిచి మెల్లిగా జారిపోయాయి.

అప్పుడే స్టాఫ్ రూంలోనికి వస్తూన్న ప్రభాకరం వేగంగా వెళ్ళిపోతూన్న ఛాయను చూచాడు. ఇటు తిరిగి రమణ స్థితిని గమనించాడు.

జరిగినదేమిటో చూచాయగా గ్రహించగలిగాడు ప్రభాకరం. కారణం—ఛాయా రమణల స్నేహం కళాశాల స్టాఫ్ అందరికీ తెలిసినదే.

"రమణా" సాదరంగా పలుకరిస్తూ అతడి భుజంపై చెయ్యివేశాడు.

రమణ చటుక్కున కనులు తుడుచుకుని మామూలు మనిషి అయిపోయాడు.

"ఛాయ ఏమిటో అదోలా వుందివ్వాళ నువ్వేమైనా నొప్పించావా ?"

"నాకు తెలియదు" ముక్తసరిగా అన్నాడు రమణ.

పరీక్షగా చూచాడు ప్రభాకరం.

"భాయిూ!" సస్నేహంగా భుజం తడుతూ అన్నాడు. "లవ్ ఈజ్ లైఫ్, జీవితమే ప్రేమ, ప్రేమే జీవితం. అది అందరికీ లభించే వరంకాదు. అదృష్టవంతులకు మాత్రమే ఛాయవంటి వివేకనీ, విద్యావతీ లభిస్తుంది. అవకాశం అనేది జీవితంలో ఒకేసారి వస్తుంది. అంచేత తెలివిగా ప్రవర్తించు. జారవిడచుకోవద్దని శ్రేయోభిలాషిగా నా సలహా ?"

విసుగ్గా చూచాడు రమణ. "నీ సలహాకు థాంక్స్ మిస్టర్ ప్రభాకరం. కానీ, నన్ను ప్రలోభాలకు లోను చేయ

వద్దని ప్రార్థన. నా జీవితం గురించిన నిర్ణయం జరిగిపోయింది. నాకు వివాహం అనేది ఈ జన్మకి లేదు."

"భీష్మ ప్రతిజ్ఞా ?"

"అలాగే అనుకో. భీష్ముడు సవతి తల్లి కోసం ప్రతిజ్ఞ చేశాడు. నేను స్వంత తల్లి కోసం శపథం చేశాను! పరిస్థితిని అర్థం చేసుకొమ్మనీ, నా కొఱకు తన జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దనీ నీవు ఛాయకు అర్థమయేట్లు చెప్పగలిగితే చెప్ప మని నా ప్రార్థన."

## 5

"అన్నయ్యా, నన్ను ఎమ్మెస్సీ చదవమంటావా?"

రాజు ప్రశ్నవిని తలెత్తి చూచాడు వ్రాసుకుంటున్న రమణ.

రాజు తన మాటను రెట్టించాడు.

అది అర్థింపులాగా లేదు. స్వరం అధికారంగా పలుకు తోంది.

"మన ఆర్థికస్థోమతు నీకు తెలుసు. చిన్నవాడవు కాదు. ఆలోచించుకో నువ్వే."

రాజు గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు కోపంతో.

అంతలో రంయ్యిన వచ్చింది తల్లి చేతులు బార జాపుతూ.

"అన్నయ్యా చదువుకోనా?'- అని తమ్ముడు ముద్దుగా అడిగితే ఇదేనా నువ్విచ్చే పెడసరపు జవాబు ? ఏం-నిన్ను మేం చదివించలేదూ ఎమ్మేస్సీ వఅకు!"

"అమ్మా! నన్ను ఒక్కడిని మీరు చదివించారు? అందు కని ఈ యింట మిగిలిన అయిదుగురి బాధ్యతలూ నావేనా? 'కన్నవాళ్ళై మీరెందుకు చదివించలేరు వాడి'నని నేనడిగితే నువ్వేం సమాధానం చెప్తావ్?"

"అనండిరా అనండి. పిల్లలు కన్నవాళ్ళనే వెక్కిరించే రోజులివి."

"అమ్మా!" అసహనంగా అరిచాడు రమణ.

"పిల్లలు కన్నవాళ్ళని వెక్కిరించే రోజు లౌనో కాదో తెలియదుకానీ,పిల్లల్ని వెట్టిచాకిరీ చేయించే కుటుంబం యిది-ముఖ్యంగా పెద్దకొడుకు చేత."

"ఎంతమాటన్నావ్ ?"

"కాక ఏమిటి? నువ్వేం జమీందారిణివా, ఆ సిపరు రాలవా ఒక్కో కూతురికి నలభై వేలు ఖర్చుపెట్టి పెళ్ళిళ్ళు చేయటానికి ? అయినా తల ఒగ్గాను, నా పెళ్ళి మానుకుని, నా జీవితం త్యాగం చేసి. ఇంకా నిష్ఠురమైతే నేనేం చేయను? రాజుకూడా ఉద్యోగంచేస్తే కుటుంబానికి సాయంకాదూ?"

"మాటి మాటికీ నీ పెళ్ళి త్యాగం చేశానని అనకు.

లక్షణమైన పిల్లలు నలభై వేల కట్నంతో వస్తే కాదని కాల దన్నావే, ఆ ఛాయ మినహా మరెవరూ లేనట్లుగా."

"చాల్లే, నువ్వు అల్లుళ్ళను కొనుక్కో; ఎవళ్ళో కొడుకులను అమ్ముకుంటున్నారని నీ కొడుకునుకూడా అమ్మకం పెట్టకు, అది ఈ జన్మలో జరగని పని."

"నీ జీవితం-నీ యిష్టం నాయనా. మరి రాజుకుకూడా సంబంధం వచ్చింది. వాళ్ళే ఎమ్మెస్సీ చెప్పించుకుని, పాతిక వేలు కట్నం యిస్తారట. లేదా మనమే పైచదువులు చదివించుకునేట్లయితే ముప్ఫై వేలిస్తారట. మరి పెద్దవాడివి నీకు కాకుండా..."

"ఫర్వాలేదు. ఈ రోజుల్లో అలా చాలా జరుగుతున్నాయి, కానివ్వండి వాడి కిష్టమైతే."

## 6

"వీర తమ్ముడి పెళ్ళికూడా అయిపోయింది. నువ్వు అలాగే వున్నావ్!"

మూడు నెలల అనంతరం ప్రప్రథమంగా తనంతట తాను మాట్లాడింది ఛాయ.

నవ్వుతూ మాటమార్చాడు రమణ. "నామీద కోపం పోయిందా, ఇన్నాళ్ళ తర్వాత మాట్లాడుతున్నావే ?"

"ఇన్నాళ్ళకైనా లోకంపోకడ అర్థం చేసుకుని మారావేమోనని చూస్తున్నాను."

"... ..."

"మీ తమ్ముడు ముప్పైవేలు..."

"ఆఁ, అమ్ముడైపోయాడు, ముప్పైవేలకు!"

"ఆ డబ్బుతో మీ చెల్లి పెళ్ళి చేస్తారా?"

"తెలియదు."

"రమణా! మరోసారి చెప్తున్నాను. బాధ్యతలు మోయటమే కాని, నాకు నీ గురించిన చింతగానీ, నీపై అనవసరంగా అధికారం చెలాయించే వాళ్ళను అదిలించటం గానీ రాదు."

"... ..."

"మరోసారి చెప్తున్నాను. ఇప్పటికీ నేను నీకోసమే ఎదురుచూస్తున్నాను. నాకూ యింట్లో అమ్మా నాన్నల ఒత్తిడి వుంది. ఒక్కగానొక్క కూతుర్ని. వాళ్ళ ముద్దు ముచ్చటలు తీర్చాల్సిన బాధ్యత నాకున్నది. వస్తాను మరి."

చీకాకుపడ్డ మనసుతో ఇల్లుజేరిన రమణ యింట ఏవో వాగ్వాదాలూ ఘర్షణా జరుగుతూండటం గమనించాడు.

"నువ్వేమంటావన్నయ్యా?" రమణను చూస్తూనే రాజు అసహనంగా అడిగాడు. "నువ్వూ వాళ్ళన్నట్టే అంటావా?"

"నే నిప్పుడే వస్తున్నానుకదా? అసలు సంగతేమిటో నాకు తెలియదు."

"నా కట్నం సొమ్ము రాధకిచ్చి పెళ్ళిచేస్తారట. అదెలా వీలౌతుంది ?"

రమణ మాట్లాడే లోపునే రంయ్యిన వచ్చింది రాజు భార్య సుధ.

"వీల్లేదు. ఆ డబ్బు నాది. నా కోసం యిచ్చారు కానీ, మీ అవసరాలకోసం కాదు. ఒక్క పైసా ఎవ్వరికీ దక్కదు అందులో."

"పెళ్ళయి ఇరవై రోజులుకూడా కాకుండానే ఇలా ప్రవర్తించే క్రొత్త పెళ్ళికూతుళ్ళుంటారన్న మాట !"

ఆమె ఎదుట మాట్లాడటానికి తానే సిగ్గుపడ్డ రమణ మౌనంగా గదిలోకి వెళ్ళిపోయాడు.

రాజు అతడిని వెన్నంటి వెళ్ళాడు.

"రాజూ!" రమణ అలసిపోయినట్లుగా మంచంపై కూలబడుతూ సంబోధించాడు. "రాజూ, ధనం ఎవరిదో వారి యిష్టప్రకారమే జరుగుతుంది. పెళ్ళయ్యాక జంట హాయిగా వుండాలి. మీ మధ్య మనస్పర్థలు నాకు యిష్టం లేదు."

"థాంక్స్, నువ్వుకూడా అమ్మా నాన్నగార్లలా మాట్లాడతావేమో ననుకున్నాను."

"లేదు రాజూ" లేచి ఆప్యాయంగా అతడి భుజం తట్టుతూ అన్నాడు. "నిన్ను కని, పెంచాం. నీ చదువుకు యింత ఖర్చు పెట్టాం అనేది అర్థంలేని మాటలు. కన్న మమ కారంతో పెంచుతారు. తలిదండ్రులే చదివించ గలిగితే ఈ ప్రపంచంలో చాలమంది విద్యావంతు లయ్యుండేవారు. రాత్రింబవళ్ళు మెదడుకు శ్రమపెట్టి, మాస్టర్ల దెబ్బలు తింటూ కష్టపడి నేర్చుకునేది విద్య. చదువుకున్న వాడిని నాకు తెలుసు — అది సరే పోనీయ్. నీవు నిశ్చింతగా వుండు. సుగుణకు చేసినట్లే రాధకూ ఏదో తాపత్రయ పడ్తాను. నేను బ్రతికున్నంత కాలం మీ రెవ్వరూ బాధపడవద్దు."

"థాంక్స్." తేలికగా అనేశాడు రాజు.

"ఇది నీకేమైనా బాగుందట్రా రమణా! గడ్డి పెట్టక ఎదురు వాడినే సమర్థిస్తున్నావ్!" గావు కేకలు పెడుతూ వచ్చింది తల్లి.

రమణ మౌనంగా వుండిపోయాడు, తాను కలుగ జేసుకోరాదన్నట్టు.

"లోకంలో ఎందరు అలా చేసుకోవడం లేదు? ఈ వాళ క్రొత్తగా వీడికే వచ్చిందా కష్టం సామ్మా?" అంత కంతకు రెచ్చిపోతోంది తల్లి.

రమణ రాయిలా కూర్చున్నాడు.

"ఛీఛీ" రాజు కోపంగా చీదరించుకున్నాడు. "నేనసలు ఈ కొంపలోనే వుండను. హాయిగా మా మామగారు నాకు

అక్కడే ఉద్యోగ మిప్పించుతానంటున్నారు ... సుధా, సర్దేయి మన సామాను."

మహాలక్ష్మి శోకాలూ, రాగాలూ ఏమీ పని చేయలేదు.

మర్నాడు తెల్లవారుఝామునే రాజు సుధతోసహా- తన సొమ్ములూ,సామాన్లతోసహా ఆ యింటినీ, యింటి బాధ్య తనూ వదిలిపెట్టాడు.

"ఏమాట కామాటే చెప్పుకోవాలి. పెద్దవాడు రత్నంకాదూ ?" మహాలక్ష్మి ముక్కు చీదింది.

"వెధవ, వెధవన్నర వెధవ. ఆడది అత్తారింటికి పోయినట్లు వీడే అత్తింటికి పోయాడు. పోనీయ్. నాకు ఇద్దరే కొడుకులనుకుంటాను." దేవయ్య నిష్ఫలంగా ఇల్లంతా దద్దరిల్లేట్టు అరవసాగాడు.

తనలో తాను నిర్వేదంగా నవ్వుకున్నాడు రమణ. మనస్సు బాగుండనప్పుడు ఏదైనా సమస్యలు తలెత్తి నప్పుడు - ఛాయతో మాట్లాడాలనిపిస్తుంది. ఇంతకాలం అలాగే జరిగింది. కానీ, ఈ మధ్య ఆ చనువును పోగొట్టు కున్నట్లు అనిపిస్తోంది. ఛాయ ఎదురుపడి కూడా, ముఖం త్రిప్పుకు వెళ్ళిపోతోంటే గుండెను పిండే బాధ కల్గుతోంది.

ఎందుకు ?

ఏమిటీ బాధకు అర్థం ?

ఛాయతో అనుబంధం మనసున తెగదా ?

ప్రేమ అంటే అర్థం యిదే. ఈనాడు తెలిసింది మనసు బాధపడ్డవేళ, ఆశ నీరసించిన వేళ ఎవరిదోతోడు. ఏదో చల్లని స్పర్శ వచ్చి ఆదుకొని సేద తీర్చాలని కోరు కుంటుంది మనసు.

అందుకే వివాహం అవసరమా?

'ఛ, ఏమిటీరోజు ఇలా ఆలోచిస్తున్నాను. ఒక నియమం చేసుకున్నప్పుడు, ఒకరికి మాట యిచ్చినప్పుడు— అందుకు కట్టుబడి వుండాలి. నీరసపు ఆలోచనలు తగవు.'

మనసును అదుపులో పెడుతూ, మరోసారి స్థిర నిశ్చయం చేసుకున్నాడు.

# 7

స్టాఫ్ రూంలో ఉదాశీనంగా కూర్చుని వున్న రమణ ఛాయ ప్రవేశంతో తలెత్తి చూచాడు.

"నీతో కొంచెం మాట్లాడాలి రమణా" అన్నది తగ్గు స్వరాన. ఇంకా ఇద్దరు ముగ్గురు సాటి ఉపాధ్యాయులుండటం వల్ల.

"పద, నేనే అసలు మీ యింటికి వద్దామనుకుంటు న్నాను." నిర్లిప్తంగా అన్నాడు రమణ.

ఇద్దరూ పార్కులో చాలాసేపు మౌనంగా కూర్చు న్నాక, ముందు తానే మాట్లాడాడు రమణ.

"రాజు ఇల్లరికం వెళ్ళిపోయాడు ఛాయా."

"ఆఁ!" ఆశ్చర్యంతో అంతకంటె మాట్లాడలేక పోయింది.

"ఔను. ఇక కుటుంబం బాధ్యత అంతా నాదే."

అధాటుగా తలెత్తి చూచింది ఛాయ.

ఆ కనులలో తీరని బాధ, ఆరని వేదన.

"ఇక నువ్వు నా కోసం నిరీక్షించవద్దు. నీకు తగ్గవారిని ఎన్నుకో."

"రమణా!"

"ఔను. రాజు అందివస్తే, మన ఆశలు తీరగలవనే చిన్న ఆశ ఏదో మిణుకు మిణుకుమనేది లోగడ. ఇప్పుడు అంతా తేలిపోయింది. ఇక ఆశ అనవసరం."

"......" తల వాల్చుకు వింటూన్నా ఛాయ ముఖం అతడికి కన్పించలేదు.

ఆమె రోదించుతూన్నదో, లేక కోపంగా వున్నదో?

"నీవు ఏ విధమైన కోపానికిగానీ, మనఃక్లేశానికిగానీ లోనుగావద్దు ఛాయా, నీ తోడి మధుర స్నేహం ఎల్లప్పుడూ నా గుండెలలో గుప్తంగా వుంటుంది. అదే చాలు ఈజన్మకు. తలిదండ్రుల సంతాన బాధ్యతను తలకెత్తుకున్న నేను స్వీయ సంసార సముద్రాన్ని ఈదలేను. కొందరు పసివాళ్ళను ఈ

ప్రపంచంలోకి తెచ్చి, వాళ్ళని చాలీచాలని బ్రతుకులు బ్రతకమని సిగ్గువిడచి చెప్పలేను; అంతటి పాపాన్ని తెలిసి తెలిసీ చేయలేను."

చాలసేపు మౌనమే రాజ్యమేలింది. మెల్లిగా తలెత్తిన ఛాయ ముఖం, తుఫాను భీభత్సపు అనంతరపు గంభీర వాతావరణంలా నిశ్చలంగా వున్నది.

"ఇందుకే కాబోలు రసుణా—'మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్' అన్నారు!"

అతి శాంతంగా వున్నది ఆ స్వరం.

కాని ఆ మాటలలో ఆమె నిశ్చయమేమిటో తెలియలేదు.

అతడు అడగలేదు.

"వస్తాను మరి. రేపు రాధకు పెళ్ళివారు వస్తున్నారు. అవసరమైన వస్తువులన్నీ తీసుకురావాలి నేను. సెలవ్."

ఆ ఆఖరి శబ్దం పలికిన తీరు—శాశ్వతంగా తన జీవితం నుండి సెలవు తీసుకుంటున్నట్లే వినిపించింది ఛాయకు.

సాగిపోతూన్న అతడిని చూస్తూ,ఆమెకనులు నిశ్శబ్దంగా రెండు కన్నీటి చుక్కలు రాల్చాయి.

ఆ స్థితిలో అచేతనంగా ఎంత సేపున్నదో ఆమెకే తెలియదు. ఎవరో "హల్లో!" అని సంబోధించేవరకు.

"ఏమిటి, ఒక్కరూ కూర్చుని వున్నారు ?" అంటూ ప్రభాకరం వచ్చి కూర్చున్నాడు సమీపంలో.

"ఏం లేదు. ఏం తోచక..."

ఆమె ఏమీ మాట్లాడలేకపోతోంది, మనసంతా భారంగా ఉన్నందున.

"ఛాయా!" ఆర్తిగా సంబోధించాడు ప్రభాకరం.

"ఏమిటి ?"

"ఈమధ్య ఎప్పుడూ చాలా గంభీరంగా విచారంగా వుంటున్నారు. ఎందుకు రమణ కారణంగానేనా ?"

సమాధానం చెప్పకుండా ఛాయ క్రింది గడ్డిని త్రుంపుతూ కూర్చున్నది.

"సారీ!" క్షమాపణాపూర్వకంగా అన్నాడు ప్రభాకరం. "మీకు నేను రమణవంటి ఆత్మీయమైన స్నేహితుడిని కాక పోవచ్చు. కానీ ఏడాదిగా కలసి పని చేస్తున్నాం ఒకచోట. కొంత మైత్రి అంటూ వున్నది. ఆ మాత్రం చనవుగా అడగ వచ్చుననుకున్నాను."

"నోనో, అదేం లేదు. ఫర్వా లేదు."

"నాకూ రమణనూ, అతడి జీవితాన్ని చూస్తే బాధ గానే వుంటుంది. మరీ అధ్వాన్నంగా వున్నది అతడి ధోరణి. మీరేమీ నచ్చజెప్పలేదా !"

విరక్తిగా నవ్వింది ఛాయ. "నచ్చజెప్పటానికి నేనెవర్ని? ఇంతవరకూ నేనూ ఒక స్నేహితురాల్ని మాత్రమే. స్నేహంగా సలహా యివ్వగలంగానీ, హద్దులు దాటి అధికారాలు చేయ లేముగదా ?"

"నిజమే. నేను రెండుమూడుసార్లు చెప్పి చూచాను. వినలేదు. అయినా నాకు మాత్రం అంతగా ఈ తనకుమాలిన ధర్మం నచ్చలేదు."

"నిజమే, కుటుంబానికి కొంత సాయంచేయడం ఎటూ తప్పదు కానీ మరీ తల్లితండ్రీ లేరన్నట్లుగా, దక్షత అంతా తనదే నన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు."

"ఆ తల్లికూడా చాలా మూర్ఖురాలు అనుకుంటాను. లేకుంటే ఇప్పటికైనా తన—కూతుళ్ళ అత్యాశలు వదలి అతడిని ఒక యింటివాడిని చేసి వుండేది!"

"........"

"కనీసం మీరూ తన కుమార్తెలాగానే ఏవో ఆశలు పెంచుకుంటారనే గ్రహింపైనా లేదా ఆమెకు పాటి ఆడ దానిగా?"

"ప్రభాకరంగారూ?" కఠినంగా అన్నది ఛాయ. "అటు వంటి స్త్రీనుండి జాలిగానీ, మరెవరి సానుభూతిగానీ ఈ ఛాయకు అవసరంలేదు. ఏదో అనుకున్నాం. అనుకున్నవన్నీ జరగవుగా?"

"సారీ!"

అంతలోనే లేని నవ్వును తెచ్చిపెట్టుకుంటూ తానే అన్నది ఛాయ, "మారిపోయిన ఆధునిక స్త్రీ ఈ సమాజం మారలేదని గుర్తించక, తన బాధ్యతలు తానే నెత్తికెత్తుకొని లేనిపోని చింతలు కొని తెచ్చుకుంటోంది. అంతే."

"నిజమే. కానీ మీరు ఏమీ అనుకోనంటే హితైషిగా ఒక్కమాట."

"చెప్పండి."

"అనుకున్నది కాకపోతే బాధే అనుకోండి. కానీ, మీరు మరీ చింతతో, మీ జీవితం మోడువారనీయక పోవటం..." ఎలా పూరించాలో తెలియక అర్ధోక్తిలో ఆపి వేశాడు.

ఠకీమని జవాబిచ్చింది ఛాయ.

"అంత తెలివి తక్కువ దాననుకాను. అతడి తలి దండ్రులకోసం అతడు వివాహం మానుకున్నాడు; అలాగే నా తలిదండ్రులకోసం నేను చేసుకోవాలి."

"గుడ్. అలా స్పోర్టివ్‌గా వుండాలి."

## 8

ఛాయా ప్రభాకరంల వివాహం!

వధూవరు లిద్దరూ స్వయంగా వచ్చారు, ఆహ్వానించ టానికి.

ఆహ్వాన పత్రిక చూస్తున్నట్లుగా తలవాల్చి తన ముఖభావాలను కప్పిపుచ్చి, విశ్వప్రయత్నంతో తన మనసును సంభాళించుకున్నాడు రమణ.

"కంగ్రాచ్యులేషన్స్ !"

అభినందనలు మనఃపూర్వకంగానే తెలిపినా ఆ మనసులో ఎన్ని తుఫానులు వున్నాయో ఆ జంటకు తెలుసు.

"తప్పక రావాలి రమణా !" అధోవదనయై, మంద స్వరాన చెప్పి, మెల్ల మెల్లగా కదలిపోయింది ఛాయ.

'ఔను. ఆమె అంతకంటె మాట్లాడదు—మాట్లాడ కూడదు. ఇక ఆమెకు తాను పరాయివాడు!'

రమణ హృదయం బాధగా మూలిగింది. వెనుక మిగిలి పోయిన ప్రభాకరం రమణ చేతిని తన చేతిలోనికి తీసుకుంటూ, అపరాధిలా అన్నాడు: "నన్ను క్షమించు రమణా!"

అంతకంటె మాట్లాడలేకపోయాడు.

"అటువంటి మాటలు వద్దు ప్రభాకరం" ప్రభాకర్ చేతిని మృదువుగా నొక్కుతూ ఆప్యాయంగా అన్నాడు: "ఈ రోజుతో నాకు ఛాయను గురించిన చింత వదిలి పోయింది. మా స్నేహం తెలిసివున్నవారు, ఏమి అపనిందలు లేవదీస్తారో, ఆమె భవిష్యత్తేమిటోనని కుమిలిపోయాను ఇన్నాళ్ళుగా. నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియటం లేదు. థాంక్స్ ప్రభాకరం, మీ ఇద్దరి జీవితం హాయిగా, చల్లగా వర్ధిల్లాలని నిత్యం ప్రార్థిస్తాను."

"థాంక్స్."

"ఒక్క రిక్వెస్ట్ ప్రభాకరం."

"చెప్పు రమణా."

"ఛాయా నేనూ రెండు సంవత్సరాలుగా స్నేహితులమే అయినా; కేవలం స్నేహితులమే. ఎన్నడూ నీ మనసున ఎటువంటి దురభిప్రాయానికీ తావీయవద్దు."

"ఛ, నేనంత సంకుచితుడిని కాను రమణా. పెళ్ళికి మాత్రం తప్పక రావాలి. లేకుంటే ఛాయ దుఃఖపడ్తుంది."

"తప్పక వస్తాను."

ఒంటరిగా మిగిలిన రమణ హృదయశోకం సప్త సముద్రాలను అధిగమించింది.

"ప్రభాకరం నువ్వు అదృష్టవంతుడవు." అని గొణుక్కున్నాడు, వేగంగా కొట్టుకుంటూన్న గుండెను ఒక చేతితో గట్టిగా అదిమిపెడుతూ.

## 9

"రమణా! ఆనాడు పెళ్ళికి రావడమే. మళ్లా రాలేదు, ఎందుకని ?"

ఆశ్చర్యంగా చూడటమే సమాధానమైంది రమణనుండి.

ప్రభాకరం వదలలేదు.

"ఈరోజు సాయంత్రం తప్పక రావాలి."

"ఎందుకూ ?" మొగమాటంగా, తనకే విన్పించనంత తగ్గు స్వరంతో గొణిగాడు.

"చూడు రమణా," ప్రభాకర్ సీరియస్‌గా అన్నాడు.

"ఒక్క విషయం మాత్రం మరచి పోగలిగితే-మనం ముగ్గురం స్నేహితులం. ఇది మాత్రం మరువరాని విషయం. మా క్రొత్త ఇల్లు చూద్దువుగాని, రా."

"క్రొత్త యిల్లా ?"

"ఔను. నీకు తెలుసుగా, నాకు తండ్రి లేరు ఇంత కాలం అన్నా వదినల దగ్గరున్నాను ఒంటరిగాడిని కనుక. ఇప్పుడు వేరే యిల్లు తీసుకున్నాను. అమ్మ కొన్నాళ్ళు మా దగ్గర వుంటుంది, కొన్నాళ్ళు అన్నయ్య దగ్గరుంటుంది."

"ఓహో ! ఇల్లెక్కడ ?"

"ఎక్కడేమిటి ? నిన్ను నాతోనే తీసుకుపోయి చూపుతాను కదా ?"

"థాంక్స్, అలాగే వస్తాలే."

వారి కోసమే ఎదురు చూస్తూన్నట్లుగా వీధి గుమ్మం లోనే నిలబడి వున్నది ఛాయ.

ఆప్యాయంగా ఆహ్వానించింది.

కుటుంబ మందరి కుశల ప్రశ్నలు వేసింది.

ఆదరంగా కాఫీ ఫలహారాలు యిచ్చింది.

ఛాయ ఎంత అతిసహజంగా ప్రవర్తించుతోందో రమణ అంతగా ముకుళించుకు పోతున్నాడు.

'ఆడవాళ్ళు అన్నీ త్వరగా మరచిపోగలరు' అనుకున్నాడు.

'ఆడవాళ్ళు ఏమీ ఎరగనట్లు నటించగలరు' అనికూడా అనుకున్నాడు.

"అదేమిటి రమణా, అలా క్రొత్తవాడిలా ఫీలౌతున్నావ్ ?" ప్రభాకరం నవ్వేస్తూ అతడి భుజం చరిచాడు. "కూర్చో. కాస్త కాళ్ళూ చేతులూ కడుక్కు వస్తాను" అని లోపలికి వెళ్ళిపోయాడు.

రమణకు చాలా యిబ్బందిగా వుంది.

"ఇల్లెలా వుంది ?" అతడి కెదురుగా కూర్చుంటూ తానే మాటలలోనికి దింపింది ఛాయ.

"బాగానే వుంది."

"ఆఁ, చిన్నదే అయినా బాగానే వున్నదనే తీసుకున్నాం. అమ్మా నాన్నగారూ అక్కడే వుండమన్నారు, కానీ నాకే యిష్టంలేకపోయింది."

"నిజమేలే, ఇదే బాగుంటుంది." ఏదో ఒకటి మాట్లాడక తప్పదు కనుక మాట్లాడుతున్నాడు రమణ.

ఒకనాడు స్నేహితురాలిగా చూచాడు. ఆనాడు పెండ్లి కుమార్తెయై మెరసిపోతూండగా కళ్యాణ మంటపంలో చూచాడు.

ఈనాడు ఒక చక్కటి గృహిణినిగా చూస్తున్నాడు !

'ఎన్ని పరిణామాలు ఆడవాళ్ళలో ?' ఆశ్చర్యంగా తలపోశాడు.

కొన్ని క్షణాలు మౌనంగా నడిచాయి.

"రమణా !"

"ఆఁ."

"అలా చిక్కిపోయావేమిటి ?"

"నేనా ? లేదే !" తడబడ్డాడు.

"పైకి కన్పించేదాన్ని కాదంటావేమిటి ? అదంతా బెంగేనా ?"

"బాగుంది నాకేం ? ప్రభాకరం వింటే బాగుండదు, ఆపుజెయ్యి" ఖంగారుగా చూచాడు.

"తను అటువంటి మనిషే. అయితే నిన్నెందుకు తెస్తారు? మనల్నిలా స్వేచ్ఛగా మాట్లాడుకోమని లోపలి కెందుకు వెళ్తారు. మనగురించి అన్నీ తెలుసు. చాలా మంచి హృదయం."

"క్రొత్తలో అందరూ — అలాగే వుంటారు ఛాయా. భగవత్కృపవల్ల అన్ని కథలలాగా నీ జీవితం ఉండకూడదనీ, నిత్యం నిత్యకళ్యాణంగా వుండాలనీ ఆశీర్వదిస్తున్నాను. కానీ, ఆత్మీయుడిగా నా సలహా — పరాయివాడిపై ఆపేక్ష ప్రదర్శించకు. నీ భర్తవద్ద నా విషయాలలో ఉదాశీనంగా వుండిపో."

"మంచివాడివే. అయితే—ఇక మీ యింటికి రాను, ఈ స్నేహం యింతతో సరి—అని అన్యాపదేశంగా చెబుతున్నా వన్నమాట ?"

"ఔను. అదే అందరికీ శ్రేయస్కరం."

"మంచిది. పోనీ, నేనే మీ యింటికి వస్తూంటాను. మాట్లాడతావా, పొమ్మంటావా ?" అంటూనే బిగ్గఱగా నవ్వేసింది.

"ఏమిటోయ్, ఏవో జోకులు వేస్తున్నట్టున్నావ్. మాకూ విన్పించు" ప్రభాకరం ప్రవేశించాడు.

"ఏంలేదూ? రమణ చిక్కిపోయాడు. ఈ మధ్య ఆడవాళ్ళందరికీ 'డైటింగ్' జబ్బు పట్టుకుంది. ఒకవేళ తను కూడా ..." అంటూ నవ్వాపింది.

ముగ్గురూ నవ్వుకున్నారు.

తర్వాత ప్రభాకరం గంభీరంగా మారిపోయాడు. "రెండో చెల్లెలి పెళ్ళి కుదిరింది తెలుసా? మరో నలభైవేలు కూర్చే తాపత్రయంలో వున్నాడిప్పు డతడు."

ఆ ప్రసంగం రమణకు యిష్టంలేక పోయింది.

"నీ సంగతి చెప్పూ, పెళ్ళయ్యేసరికి అంద రాడవాళ్ళకు మల్లేనే ఇల్లు పట్టుకూర్చున్నావేమిటీ? ఉద్యోగం ఎందుకు మానేశావ్ ?"

ఛాయ చెంపలు కెంపువర్ణం తిరగగా, ఏదో పనున్నట్టు అక్కడినుండి లేచి వెళ్ళిపోయింది.

"నేను చెయ్యమన్నాను. తనకే యిష్టంలేదు" అప రాధం చేసినట్టు గొణిగాడు ప్రభాకరం. "మొదట్లో కొద్ది రోజులకని సెలవు తీసుకుంది. తర్వాత ఆరోగ్యం బాగుండక రిజైన్ చేసింది."

"ఏం ఆరోగ్యానికేం?" ఆత్రతగా అడిగాడు రమణ.

ప్రభాకరం యిబ్బందిగా కదిలాడు మాటలకు తడుము కుంటూ.

అతడిని రక్షించటాని కన్నట్లుగా ఛాయ పుట్టింటి పని మనిషి వచ్చింది.

"అమ్మాయిగారి ఒంట్లో ఇవ్వాళ ఎలా వున్నదో కనుక్కురమ్మన్నారు అమ్మగారు. ఇవిగో పచ్చి మామిడి కాయలూ, ఉసిరికాయలూ తినమన్నారు-నోరు బాగుంటుంది. అసలు నేవిళ్ళు తగ్గేవఱకూ అక్కడేవుంటే బాగుంటుందని చెప్పమన్నారు" బడబడా వాగేసింది.

"ఆఁ, రేపు నేను తీసుకొచ్చి దిగబెడతానని చెప్పు" అంటూ "ఛాయా, చూడు—మీ అమ్మగారు కబురంపిం చారు" అని లోనికి కేక వేసాడు.

ఎదుటి తెరచాటునుండి ఛాయ ముఖం కన్పించీ కన్పించకుండా నిలబడి, "రేపు వస్తానని చెప్పవే అమ్మకు" అనేసి మళ్ళీ లోనికి మాయమైంది.

రమణకు పరిస్థితి అర్థమైంది.

మరో పదినిముషాలు ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుని వచ్చేసాడు.

అతడి మనస్సంతా అల్లకల్లోలమై పోయింది.

ఛాయ కనులలో ఆ తళుకు!

ప్రభాకరం వదనంలో ఆ గర్వం!

వివాహ జీవితపు ముచ్చటలు ప్రారంభమైనాయి.

అదృష్టవంతులు.

మనసు నిర్విరామంగా ఏడ్వసాగింది.

'ఛాయ నీకు ఆత్మీయురాలు! ఆమె అందమైన కాపురం చూచి ఏడుస్తున్నావా?' మనసును అడిగాడు.

'కాదు. ఎడారిలాంటి నిన్ను చూచే ఏడుస్తున్నాను' అన్నది మనస్సు.

'నాకేం, నిక్షేపంలా వున్నాను. అన్ని జీవితాలూ ఒక్కలా వుంటాయేమిటి?'

మనస్సును అదిలించి, ఆత్మను మభ్యపెట్టి తనను తాను సంబాళించుకుని అర్ధరాత్రికి ఇల్లుజేరాడు.

ఆవులిస్తూ తలుపు తీసిన లక్ష్మీదేవమ్మ విసుగ్గా చూచింది కొడుకు వేపు.

ముక్కుతూ మూలుగుతూ వడ్డించింది.

నాల్గు మెతుకులు తిన్నాననిపించి తన గదిలోకి వెళ్ళి

పోయిన అయిదు నిముషాల అనంతరం అతడికి తలిదండ్రుల సంభాషణ వినవచ్చింది.

"అర్ధరాత్రివరకూ కొంపకు జేరుకోకుండా ఏం జేస్తున్నాడో అడగలేక పోయావా?" దేవయ్య భార్యను గదమాయించినట్టు అంటున్నాడు.

"బాగుంది! ఏమడగను. నేను ఆడదాన్ని? ఒంటరి బ్రతుకులు అలాగే వుంటాయి, అర్ధరాత్రి తిరుగుళ్ళు నేర్పుతూ. పోనీ పెళ్ళి చేసుకోమంటే వినడాయె!"

జుగుప్సతో మంచం ఎత్తి దొడ్లో బాదంచెట్టు క్రిందికి పట్టుకుపోయి వేసుకున్నాడు రమణ.

'ఈ జన్మకు కాదు సరికదా—మరెన్ని జన్మలకైనా ఈ యింట పెద్దలకు పెద్దరికంతో ఆలోచించడంగానీ, హుందాగా ప్రవర్తించడంగానీ, వస్తుందా?'

# 10

"ఎంత తాపత్రియపడినా డబ్బు సమకూర్చగలనన్న ధైర్యం లేకపోతోందమ్మా. ఆ సంబంధం వాళ్ళను కనీసం ఓ రెండేళ్ళయినా ఆగమనాలి."

వింటూనే లక్ష్మీదేవి అప్రసన్నురాలై పోయింది.

"బాగుంది, ఏదో సామెత చెప్పినట్టు - అయ్యొచ్చే వఱకూ అమావాస్య ఆగుతుందా? చక్కటి సంబంధాన్ని చెయ్యి జారనీయకూడదు."

"మన చేతిలో డబ్బున్ననాడు అంతకు మించినాళ్ళు మరోళ్ళు దొరక్కపోరు."

"ఇంతకూ ఏమంటావ్ ?"

"అనేదేముంది? అన్నీ నీకు తెలిసినవేగా ! సుగుణ పెళ్ళికోసం చేసిన అప్పులు తీర్చటానికే రాత్రింబవళ్ళూ పుస్తకాలు రాస్తున్నాను. ట్యూషనులు చెపుతున్నాను. ఇంకా ఏం చెయ్యను? ఇప్పుడు కొత్తగా అప్పులు ఎక్కడ తేనూ? ఎవరిస్తారూ?"

దేవయ్య విసవిసా వచ్చాడు రంగంలోకి, "ఒరేయ్, ఎవడి దయాధర్మాలూ అక్కర్లేదురా, నాకొట్టే చిర్రెత్తు కొచ్చిందంటే ఈ కొంప కాస్తా అమ్మి పారేస్తాను."

రమణ తోణకక పోగా మరింత నిబ్బరంగా నిలబడ్డాడు. "మంచిది. నాకేం అభ్యంతరం లేదు. అదేదో త్వరగా చేయండి. అప్పుడైనా అమ్మకు మనశ్శాంతిగా వుంటుం దేమో?"

"ఔన్రా, నీకే మభ్యంతరం? నువ్వేమైనా కట్టావా, సంపాదించావా ఈ యింటిని? అమ్మటానికి నీకు నొప్పెందు కుంటుంది ?"

"మంచిమాటే అడిగారు కానీ, ఈ ప్రశ్నే ఇంకా మీ మిగిలిన ఇద్దరు కొడుకుల్ని కూడా అడిగి చూడండి."

"ఔను. రాజు బాధ్యతలు దులుపుకు పోయాడు. రంగడు ఇంకా యూనివర్సిటీ చదువుకు నీమీదే ఆధారపడి వున్నాడు. ఇక దిక్కు నీ వొక్కడివేకదా అని విర్రవీగుతున్నట్లున్నావ్ ?"

"అమ్మా !"

"ఆఁ! ఏమీ అబద్ధంగానీ అనలేదు నేను. అప్పులు చేశావు, అందరికీ గొప్పగా కన్పించటానికి. ఇప్పుడు తల దాచుకోడానికి లేకుండా ఇల్లు అమ్మమంటున్నావ్. లోకులు నన్నాడిపోసుకోవటానికి పెళ్ళి మానుకుని కూర్చున్నావ్. పెళ్ళి చేసుకుని, ఆ వచ్చేడబ్బు యిలాగ సర్దితే ఏ గొడవా లేదుగా ?"

"ఆ వచ్చే అమ్మాయికూడా రాజు భార్యలాగే హఠం చేస్తేఏం చేస్తావ్ ?"

"ఎలా చేస్తుంది. ముందే షరతు పెడితే ?"

"సరే, ఆ షరతులతో రంగడి పెళ్ళి చెయ్యి, నీ మాట వింటే వాడు. ఎమ్మే చదువుతున్నాడు గనుక మంచిధరే పలుకుతుంది. నన్ను అమ్మకం పెట్టకు."

# 11

రాధ వివాహం, రంగడి వివాహం ఒక్కసారే జరిగాయి అట్టహాసంగా.

చుట్టాలలా వచ్చిన రాజూ సుధా బద్ధ శత్రువులలా ప్రవర్తించారు.

"ఈ ఇల్లు ఈ యింట పుట్టిన అందరిదీను. దాని ఒక్కతె కోసం ఇంటిమీద నలభై వేలు తెస్తారా ?" క్రోధంగా అడిగాడు రాజు.

"ఆ లెక్కన మా అందరికీ కూడా వాటాలు పంచి యివ్వండి. ఇది అమ్మటానికి వీల్లేదు" సుధ ఎగిరెగిరి పడింది.

"కాస్త పెళ్ళికి సాయం చేయకపోగా వాటా అడగ డానికి సిగ్గులేదా ?" మహాలక్ష్మి తారాజువ్వలా లేచింది.

"ఎందుకు సిగ్గు? పిత్రార్జితం అంతా ఒక్కళ్ళ నెత్తినే పెట్టడానికి మీా యిష్టమేనా ? మీారు సవ్యంగా యివ్వక పోతే, కోర్టులున్నాయి" రాజు ఎగసిపడుతూ అక్కసుగా అన్నాడు.

"ఉండే ఈ యిల్లు అమ్మి మమ్మల్నందర్నీ ఎక్కడుండ మంటావమ్మా? ఏమైనా ఆలోచించావా ?" రంగడు కూడా

రాజుకు వత్తాసు పలికాడు. పెళ్ళితో అతడికీ పెద్దరికం వచ్చింది.

"నీ మామగారు యిస్తానన్న కట్నం సమయానికి యివ్వలేదు. మరి రాధ పెళ్ళి ఆగిపోతుందని కదా అప్పు తెచ్చాం?"

అంతవరకూ గదిలోవున్న రంగడి భార్య సుశీల వచ్చింది రంగంలోనికి. "మా నాన్నగారు కట్నం మరి ఇస్తారనే ఆశకూడ పెట్టుకోకండి. ఈ రోజుల్లో కట్నం అడగడం, ఇవ్వడం నేరమని తెలుసా?"

నిన్ననే పెళ్ళయి, ఈ ఉదయమే వచ్చిన క్రొత్త కోడలినీ, ఆమె ధిక్కారింపునూ కొన్ని క్షణాలు అప్రతిభులై చూచారు అందరూ.

"ఎట్లా అమ్ముతారో చూస్తాం. మేము సంతకాలు పెట్టం" ఖరాఖుగా అన్నారు రాజూ, రంగడూ.

ఇక రమణ కలుగజేసుకోక తప్పలేదు.

"ఇన్ని న్యాయాలూ, చట్టాలు తెలిసిన మీా కందరికీ, వృద్ధులైన తలిదండ్రులు తమకు చేతనైన విధంగా తమ బాధ్యతలను తీర్చుకుంటున్నారని తెలియదా? కొంత వయస్సు వచ్చాక పెద్దవాళ్ళ సంపాదనమీాదా, వాళ్ళ ఇంటిమీాదా తిండి మీాదా ఆధారపడి వుండడం అప్రయోజకత్వానికి చిహ్నం. సిగ్గుచేటైన విషయం."

"నోర్మూయ్!" రాజు ఆవేశంగా అరిచాడు.

"పెళ్ళీ పెటాకులూ లేని బైరాగాడివి ఎన్నైనా చెప్తావ్. మా పెళ్ళాం, పిల్లా పాపా ఏమైపోతారను కున్నావ్ ?"

తన తమ్ముడే తనను పదుగురిలో—ముఖ్యంగా స్త్రీల ఎదుట ఇలా అవమానించగలడని అనుకోని రమణ నీరుగారి పోయాడు. మరి తానేమీ మాట్లాడి ప్రయోజనం లేదని కూడా గ్రహించాడు.

మౌనంగా బయటికి నిష్క్రమించాడు.

అనుకున్నంతా జరిగింది.

"మైనారిటీ దాటిన కొడుకులంతా సంతకాలు చేస్తే తప్ప కొనలేం" అన్నారు కొనుగోలుదారులు.

"ఎలాగ? రాధ పుట్టింట్లోనే వుండి పోతుందా?" మహాలక్ష్మి నెత్తీ నోరూ కొట్టుకుని శోకాలు సాగించింది.

"అమ్మా! ఏడవకు" రమణ తిరిగి లోనికి వచ్చి అన్నాడు "దారి ఆలోచించు."

"ఇంకేందారి? గోదారేగతి."

"అలా నిరుత్సాహపడకు. నిజంగా కట్నం ఇవ్వడం నేరమే. ఇది ప్రభుత్వం దృష్టిలోనికి తెచ్చి మనం రాధను అధికారంగా పంపవచ్చు అత్తింటికి."

"చాల్లే ఆడపిల్ల కాపురమా మరేమైనానా? ఆనక ఈ కక్షతో వాళ్ళు పిల్లని ఏమైనా చేస్తే! ఎన్ని వినడంలేదు? అయినా మన పిల్లకు మనం ఇచ్చుకుంటున్నాం" కసిరి పారే

సింది మహాలక్ష్మి. "ముగ్గురన్నదమ్ములూ కలసి తోడబుట్టినదాని కాపురం కచ్చికలు చేస్తారా ?" ఏడుస్తూనే అరచింది.

'ఇటువంటి మూఢాచారాలతో మగ్గే వాళ్ళకు ఏ ప్రభుత్వ శాసనం సహాయం చేయగలదు ?' నిస్సహాయంగా తనలో తాను నిట్టూర్చాడు రమణ.

"అమ్మా, ఆఖరిమాటగా చెప్తున్నాను. ఇల్లు నాల్గు వాటాలుచేసి నా భాగం, మీ భాగం అమ్మి రాధ కివ్వండి. రాజూ, రంగడూ కూడ అసంతృప్తి చెందాల్సిన అవసరం వుండదు. ఒంటిగాడిని గనుక నాకు నా రాబడిచాలు. మీరూ బరువుకాదు."

మరో మార్గం లేదు గనుక రమణ చెప్పినట్లే జరిగింది.

ఒక్క గదీ, వరండా, కాస్త పెరడూ వున్న అద్దె ఇంటికి నివాసం మారింది.

సుగుణా, రాధల రాకపోకలు, తలిదండ్రుల పోషణ, ఇంటి అద్దె, ఇంకా తీరకుండా మిగిలివున్న పాత అప్పు— అన్నీ తన ఒక్కని భుజస్కంధాలపైననే వున్నవని గ్రహించిన రమణ పూర్తిగా యంత్రమైపోయాడు.

కళాశాలలో పని—ఇల్లు జేరుతూనే వ్రాత మొదలు.

డబ్బు, డబ్బు. ఋణవిముక్తి—ఈ రెండు పదాలే ఇప్పుడతనికి తెలిసినవి.

తల్లి మొదట నోరు మూసుకువున్నా ఇటీవల మరలా సణుగుడు మొదలు పెట్టింది.

"బొత్తిగా ఒక్కగది కొంప. కూతుళ్ళూ, అల్లుళ్ళూ ఒక్కసారి వస్తే చిన్నతనంగా వుంటోంది."

"చూస్తాను పెద్ద ఇల్లు" అన్నాడు నిర్లిప్తంగా రమణ.

కానీ ఎక్కడ చూస్తాడు? అతడికి తీరికా లేదు. 'అద్దె కట్టే శక్తి వున్నదా' అనేది కూడా ప్రశ్నే.

"ఏరా అబ్బాయి? పెద్ద ఇల్లు యింకా దొరకలేదూ? లేకపోతే వద్దనుకున్నావా? ఈ కోళ్ళగూట్లో నే నుండ లేనురా. లంకంత ఇంట్లో మహారాణిలా బ్రతికినదాన్ని."

"నేను వరండామీద వుంటాన్లేమ్మా. ఎలాగో సర్దుకుందాం."

"నువ్వు వరండామీద వున్నా, చెట్టుక్రింద వున్నా సరిపోతుంది. పండక్కి వచ్చే అల్లుళ్ళ మాట నే చెప్పేది."

"సరే, నేను దొడ్లో బాదం చెట్టుక్రింద చిన్న తాటాకుల గుడిసె వేయించుకుంటాలే. ఆ వున్న గదే రెండు భాగాలు చేద్దాం. అద్దెలు మండిపోతున్నాయట."

కొడుకు కోపంతో అన్నాడనుకుంది. కానీ మర్నాడే అతడు అన్నంత పనీ చేస్తూంటేనిలువుగ్రుడ్లు వేసుకు చూశారు మహాలక్ష్మమ్మ, దేవయ్యా కూడా.

సాయంత్రానికే తయారైన ఆ తాటాకుల మట్టి గది లోనికి తన బల్లా, కుర్చీ, మంచం, కాగితాలూ జేరవేసుకున్నాడు.

"బాగుంది నాయనా, నేనేదో మాట సామెతగా అంటే..."

"ఫర్వాలేదమ్మా. నాకు మంచి ఉపాయం తోపింప జేశావు ఆ విధంగా. మట్టి యిళ్ళు చల్లగా వుంటాయి. అది మాత్రం ఏం తక్కువ? వందరూపాయల పైనే అయింది" అన్నాడు తేలికగా నవ్వేస్తూ.

"బావగారు కుటీరంలో నివాసం పెట్టారే!" అని చెల్లెళ్ళ భర్తలు తన ముఖంపైననే పరిహసించినప్పుడూ,

"ఎవర్ని సాధించాలని అన్నయ్య అలా గుడిసెల్లో కాపురం పెట్టాడు?" అని సుగుణ చాటుగా తల్లితో అనడం వినడం తటస్థించినపుడూ,

"మీ పుట్టింటాళ్ళు పూరిపాకల వాళ్ళని మా అత్తారు గేలిచేస్తారమ్మా" అని రాధ ఏడుపుముఖం పెట్టినప్పుడూ కూడ రమణ ముఖంపై ఆ చిరుహాసం అలాగే చెదరక నిలచింది.

"అల్లుళ్ళకు లాంఛనాలూ, కూతుళ్ళకు చీరలూ" మహాలక్ష్మి కొడుక్కి పుర్మాయించింది.

మాట్లాడకుండా అయిదు వందలు తీసిచ్చాడు రమణ.

"ఏం పెట్టుపోతలో, ఏం లోకమో! ఇవేం సరి పోతాయి!" తల్లి గొణుగుడు విననట్లే వుండిపోయాడు.

దేనికైనా సరే తర్కమూ, ఎదురు చెప్పడమూ మాని వేశాడతడు.

"మరో రెండు నెలల భాగ్యానికి ఇటూ అటూ ఎందుకు? సుగుణను విడిచిపెట్టి వెళ్ళమను. ప్రసవించాక మూడో నెలకు పంపుదాం. అల్లుడితో నువ్వు చెప్పు."

"అలాగే."

"సుగుణకు అప్పుడే రెండో బిడ్డా? ఆడవాళ్ళు ఎంతలో ఎదిగిపోతారు, చెట్లు పూలుపూసి కాయలు కాచినట్టు!"

అంతలో అతడికి ఏమో గుర్తుకు వచ్చింది.

'ఛాయకు కొడుకా కూతురా? తన నిర్లిప్తతవల్ల నేమో—ఈ మధ్య ప్రభాకరం కూడ మాటలు తగ్గించాడు.'

# 12

"శుభవార్త మిస్టర్ రమణా! హెడాఫ్ ది డిపార్టుమెంట్‌గా ప్రమోషన్స్ వచ్చాయి మనకు ఇద్దరికీ."

కళాశాలలో అడుగు పెడుతూనే వార్త చెప్పాడు ప్రభాకర్.

"మరో శుభవార్త కూడా చెప్పుమరి!" ప్రక్కనున్న లెక్చరర్ అన్నాడు. "నీకు నిన్న ఉదయం అమ్మాయి

పుట్టిందిగా, ఆ సంగతి చెప్పవేం ? సిగ్గా?" అంటూ ఆటలు పట్టించాడు.

వింటూన్న రమణ గుండె వేగంగా కొట్టుకున్నది.

"కంగ్రాచ్యులేషన్స్" అని అనగలిగాడు.

'ఛాయ సుఖంగా వున్నదా !' అని అడగాలనుకున్నాడు.

కానీ అలా అడగకూడదేమో తాను ?

"అమ్మాయి పుట్టి నీకు ప్రమోషన్ తెచ్చింది. అదృష్టవంతురాలు" ప్రభాకరం జబ్బపై కొడుతూ నవ్వుతున్నాడు మరో స్నేహితుడు.

అందరి అభినందనలకూ కృతజ్ఞతలు చెప్తున్నాడు ప్రభాకరం.

"అయితే మాకు మంచి పార్టీ వుందన్న మాట ? రెండు శుభాలు ఒక్కసారి !" అని ఒకతడు.

"తప్పకుండా యివ్వాలి. లేకపోతే వూరుకుంటామా?" మరొకతడంటున్నాడు.

ఆ సందడినుండి నెమ్మదిగా బయటకు నడిచాడు రమణ.

అతని గుండెలో అనిర్వచనీయమైన బాధ సుడులు తిరుగుతూన్నది.

'ఛాయ తల్లి అయ్యింది.'

అది ప్రభాకరానికి సంతోష వార్త విందులు చేసుకుంటారు, వినోదిస్తారు.

వారి జీవన గ్రంథంలో పుటలు తిరుగుతున్నాయి. ప్రకరణాలు నడుస్తున్నాయి.

కానీ...తన జీవిత కథ ప్రథమ ప్రకరణంలోనే ఆగిపోయింది.

ఈ జీవితానికి సంతోష వార్తలు లేవు.

ఈ ఎడారి హృదయంలో విరితావిలు వుండవు.

'అబ్బా? ఎందుకు దైవం యింత కఠినమైన ఒంటరి శిక్షను అనుభవించమన్నాడు !'

'వెర్రివాడా ! ఎందుకు నింద దైవంపై వేస్తావ్ ? ఇదంతా నీ తెలివితక్కువతనం !'

మనస్సు హేళనగా మందలించింది.

ఆ రోజు ఏ కార్యక్రమమూ సరిగా నిర్వర్తించ లేని మానసిక అస్వస్థత ఆవరించిన అతడు త్వరగా యిల్లు జేరాడు.

కాఫీగ్లాసు అందిస్తూ తల్లి అన్నది!

"ఒక మూడు వందలు కావాలి నాయనా రేపటికి."

"ఎందుకూ ?"

చిత్రంగా చూచింది మహాలక్ష్మి.

"సుగుణ ప్రసవించి ఆస్పత్రిలో వున్నదనే విషయం అసలు నీకు గుర్తుందా ? వారం రోజులైంది. స్వంత

అన్నవై వుండీ ఒక్కసారి అటు వచ్చి చూచావా తల్లినీ బిడ్డనీ ?"

"ఏనీ, అసలు ఖాళీ వుంటేనా ?" నెమ్మదిగా అన్నాడు.

"సరేలే, ఈ వంతపాట రోజూ వుండేదేగా ? రేపటికి డబ్బు మరచిపోకు. డాక్టరు బిల్లు యిచ్చేసి ఎల్లుండి యింటికి తీసుకొచ్చి పురుడు పోయాలి."

"అలాగే. రేపు మధ్యాహ్నానికి సర్దుతాను.

"రేపు డబ్బు తీసుకొని కాస్త అటురా, లేకుంటే సుగుణ నొచ్చుకుంటుంది."

"సరేలే."

మర్నాడు నర్సింగ్ హోంకు వచ్చిన అన్నను చూసి చింకి చాటంత అయ్యింది సుగుణ ముఖం.

"ఈ నాటికి ఖాళీ అయ్యిందా మేనల్లుడిని చూడటానికి ?" నిష్ఠురమాడింది.

నీరసంగా నవ్వి వూరుకొన్నాడు రమణ.

"చూడు ఆ నుదురూ, ముక్కూ అంతా నువ్వే నంటోంది అమ్మ, ముమ్మూర్తులా."

పిల్లవాడి మీదినుంచి చూపులు మరల్చుతూ అన్నాడు:

"నా పోలిక ఎవరికీ వద్దు సుగుణా, వాడి జీవితం ఆనందంగా వుండాలి."

"చాల్లే అన్నయ్యా, నీకేం తక్కువ? చక్కగా ఎమ్మే పాసయ్యావు, చేతినిండా డబ్బు..."

ఆ బుద్ధి తక్కువ స్తోత్రం మరి వినలేనట్టుగా లేచాడు "పనుం" దని.

"ఒక్కమాట అన్నయ్యా."

"ఏమిటి ?"

"మగబిడ్డకదా? మా అత్తరూ వస్తారు ఇరవయ్యోకో-నాటికి. బాలసారె ఘనంగా చెయ్యాలి."

"అలాగేలే" మనఃపూర్తిగానే అన్నాడు. "అమ్మకు తెలుసుగా అన్నీ !"

"జౌననుకో, క్రితం సారి ఆడపిల్లే గనుక మూడు కాసుల బంగారంతో సరిపెట్టారు. వీడికి నాలుగైదు తులాలైనా పెట్టకపోతే మా అత్తింటివారి దగ్గఱ చిన్నతనంగా వుంటుంది."

గుండె నోటిలోకొచ్చినంత పనైంది రమణకు.

"అంతేకాదు. మనమ్మాయికీ, అల్లుడికీ మంచి బట్టలు పెట్టాలి. వచ్చినాళ్ళకికూడా తగ్గట్టు పెట్టుకోకపోతే చిన్నతనం. ఇప్పట్నుంచి కాస్త ఆ ఏర్పాటులో వుండు." తల్లి ఆదేశించింది.

మౌనంగా నిష్క్రమించాడు రమణ.

'భగవాన్! జలగలను మానవరూపంలో ఎందుకు సృష్టిస్తావు ?' అని నిరశించకుండా వుండలేక పోయింది అతడి మనసు.

కథా నిలయం
932
శ్రీకాకుళం

# 13

"ఇప్పటికే మీ దగ్గఱ మా డబ్బు అయిదువేలు అడ్వాన్స్ వుంది. మఱిలా ఎలా ఇవ్వం సార్ ?" నిష్కర్షగా అన్నాడు పబ్లిషర్.

"వుంటే మీకేం నష్టం ? పుస్తకాలు వ్రాసి యిస్తూనే వున్నానుగా ?"

"ఔననుకోండి. కానీ డబ్బు ముందే పెట్టుబడి పెట్టడం మాటలు కాదు. అందులోనూ రెండు తుఫానుల తాకిడికి పంటలు నాశనమై జనం అల్లల్లాడుతున్న ఈ రోజుల్లో పుస్తకాలెవరు కొంటారు చెప్పండి. మా అమ్మకం సన్నగిల్లింది ఈ మధ్య."

"మీరు చెప్పేది మామూలు కథల పుస్తకాల విషయంలో కావచ్చు. స్కూలు, కాలేజీ గైడ్స్ స్టూడెంట్సందరూ తప్పనిసరిగా కొంటారు !"

తెలివి తక్కువ వాడిని చూచినట్టు చూచి నవ్వేశాడు పబ్లిషర్.

"ఎక్కడి పాతకాలపు మనుషులండీ బాబు మీరు? ఈ రోజుల్లో గొప్పా బీదా తారతమ్యం లేకుండా ప్రతి గృహిణీకీ కథల పుస్తకాలు కావాలి. ప్రతివాడికీ సినిమా కావాలి. వాటికున్న గిరాకీ ఇక దేనికుంది చెప్పండి. ఇదే గనుక మీరు నవల రాసి పారేశారంటే, మీరడక్కుండానే ఇవ్వనూ?"

నవలలు వ్రాసేవాళ్ళతో మరో ఫక్కీలో బేరాలూ, మోసాలూ జరుగుతాయని తెలుసు రమణకు.

డబ్బుయిచ్చేవాడికి అడిగేవాడు లోకువ.

తనవల్ల ఆ పబ్లిషర్ ఎంత లాభాలు గడించిందీ తనకు తెలుసు, అయితేనేం? ఇంకా డబ్బు సంపాదించాలనే యావే కాని, అందుకు కారణ భూతుడైన కృతికర్తకు కూడా న్యాయమైన మొత్తం యివ్వాలనే సచ్చింతన లేదు.

అవసరం తనది.

ముష్టి ఇస్తూన్నట్లుగా గీసి గీసి రెండువేలు ఇచ్చి, నాలుగు పుస్తకాలు వ్రాసి ఇవ్వటానికి అగ్రిమెంటు వ్రాయించుకున్నాడు.

"ఈ డబ్బుతో బంగారమే కొననా, బట్టలే కొననా,

వేడుకే జరపనా? మరి ఇలా గీసి గీసి తెస్తే ఎలారా అబ్బాయి?" నిరశిస్తూ అడిగింది తల్లి.

"అమ్మా! శక్తివంచన లేకుండా ప్రయత్నించి దొరికినంతవరకూ తెచ్చాను. ఇక నావల్ల కాదు."

"అలాగంటే ఎలా నాయనా? మన కష్టాలు మన కుండేవే. ఆడపిల్లలకు అచ్చటా ముచ్చటా తీర్చకపోతే ఎలా?"

అప్పుడే సుగుణ ముక్కు చీది, కళ్ళు తుడుచుకోవడం ప్రారంభించింది.

"ఆడవాళ్ళం—పుట్టింటి పెట్టుపోతల మీాద ఆ మాత్రం ఆశలు లేకుండా వుంటామా?" ఇది మా అత్తారి ముందు తల ఒంపులు కాదూ?"

"ఏమీాకాదు. వున్నంతలో సరిపెట్టుకోవాలి" శాంతంగా నచ్చజెప్పబోయాడు.

"చాల్లే." ఈసడించింది సుగుణ. "మా తోడికోడళ్లు పుట్టిళ్ళనుండి ఎన్నెన్ని తెచ్చుకుంటారో తెలుసా? పెళ్ళైతే నీ పెళ్ళాం తెచ్చుకోవడం చూచివుండేవాడివి. పెళ్ళికాక నీకు పద్ధతులు తెలియవు!"

చెప్పుతో కొట్టినా ఈ ఈ మెల పోటులంత బాధ కలగ దేమో?

తనకంటె చిన్నది—తన కష్టసుఖా లన్నిటినీ కళ్ళతో

చూస్తూన్న తోడబుట్టినది—తనను నిబ్బరంగా, నిస్సంకోచంగా విమర్శించగలదని అతడేనాడూ అనుకోలేదు.

కొన్ని నిముషాలు మతిపోయినట్టు చూచాడు.

"నాకు పెళ్ళే అయివుంటే రాజూ, రంగడిలాగే నీకు ఒక్కపైసా దక్కనీయక పోదునని తెలుసా ?" అన్నాడు సూటిగా చూస్తూ.

"మాటకిముందు ఇదొకటి. నా గురించి పెళ్ళి త్యాగం చేసినట్లుగా గొప్పమాటలు !" కళ్ళు తుడుచుకుంటూ, కాళ్ళు తప తపా నేలన కొట్టుకుంటూ నిష్క్రమించింది సుగుణ.

'తాటాకుల పాకలో బ్రతుకుతూ, తనువంతా ధార పోసి సంపాదించి తెచ్చినా వీళ్ళకు తృప్తిలేదేం ?'

పాకలో ఒక్కడూ మిగిలిన రమణ నిస్సహాయంగా నిట్టూర్చాడు.

తన సరదాలూ, వేడుకలూ వదలుకొని ఇతరుల సరదాలూ, సంతసాలకై శ్రమనంతా ధారపోస్తూన్నాడు. సాధ్యమైనంత తక్కువఖర్చులో యోగివలె బ్రతుకుతున్నాడు. ఇంతకంటె ఏంచేయాలి ? ఎవరు మాత్రం ఏం చేయగలరు ?

అంతకు పూర్వం మనసులో నిండుకొన్న వైరాగ్యానికి నేడు అపరిమితమైన ఏవగింపు తోడయింది.

'ఛీఛీ, నావంటివాళ్ళు ఈ ప్రపంచంలో పుట్టకూడదు. పుట్టినా చాలా తక్కువ కాలం జీవించాలి !' అనుకున్నాడు బాధగా.

# 14

"రమణా !"

పరధ్యానంగా వ్రాసుకుంటూన్న అతడు అదరి పాటుతో చూసాడు.

తననే నిశ్చలంగా చూస్తూ నిర్మలంగా నిలబడివుంది ఛాయ, చేతిలో పసిబిడ్డ నెత్తుకొని.

"ఓ ! దా, కూర్చో, ఏమిటిలా వచ్చావ్ ?"

"బాగుంది ప్రశ్న, నువ్వు రావడం మానేయగా, నన్ను 'ఎందుకొచ్చా'వని కూడా అడుగుతున్నావన్న మాట."

రమణ మాట్లాడలేదు. ధరణి కభిముఖమైంది అతడి వదనం.

"నిన్న మా పాప నామకరణం. వేడుకకు పిలిస్తే వచ్చావుకాదు. నాపై కోపమా ?"

బాధగా నవ్వాడు కణతలు రుద్దుకుంటూ.

"ఆ ప్రశ్న నిజంగానే అడిగావా? నీపై నాకు కోపమా ?"

"మరి ? నీకోసం మేమిద్దరం యెంత యెదురు చూచామో తెలుసా ?"

"ఛాయా, నేను వచ్చినా రాకున్నా నా మనఃపూర్వక ఆశీర్వాదాలు పాపకెప్పుడూ వుంటాయని నీకు తెలుసు" అంటూ ఆమె చేతులలోనుండి పాపను ఆప్యాయంగా అందుకున్నాడు.

"ఏం పేరు పెట్టుకున్నావమ్మా పాపా ?" అని అడుగుతూ పాపతో ఆడుతూన్నట్లు నటిస్తూ అతడు తన కనులలోని నీటి పొరను దాచుకొంటున్నాడని గ్రహించింది ఛాయ.

జీవం లేని ఆ కంఠస్వరం ఆమె అంత రాంతరాలను కలచివేసింది.

ఆమె తననే పరిశీలనగా గమనించుతూన్నదని గ్రహించిన రమణ హఠాత్తుగా లేచి పుస్తకాల రాక్‌లో ఏదో వెదుకుతూ ముఖాన్ని మఱగు పరుచుకున్నాడు.

అయిదు నిముషాల తర్వాత తనను తాను సంబాళించుకుని పుస్తకంలో దాచి వుంచిన డబ్బు యాభై రూపాయలు ఛాయకు అందించుతూ అన్నాడు :

"పాపకు దానితో మంచి గౌను కొను ఛాయా, ఇంత కంటె ఇవ్వలేని దౌర్భాగ్యుడిని."

ఛాయ ఆ డబ్బును అందుకోలేదు.

"నీ ఆశీర్వాదబలమే పాపకు పదిలక్షలతో సమానం. నేను ఈ బహుమానాలు అందుకోవటానికి రాలేదు. పాపను నీకు చూపుదామని వచ్చాను."

"మా అమ్మ కోపంగా వున్నది. పోనీ నువ్వు తీసుకో తల్లీ" అంటూ పాప చేతిలో వుంచాడు ఆ నోటు.

ఏదో అర్థమైనట్లే బోసిగా నవ్వులు కురిపించుతూ ఆ బహుమానాన్ని పిడికిలిలో బిగించి పట్టుకున్నది పాప.

"ప్రభాకరం కాలేజీకి వెళ్ళాడా?" అన్నాడు ప్రసంగాన్ని మార్చుతూ.

"ఆఁ, నిన్న తానూ చాలా అనుకున్నారు నీ గురించి."

కొంత తడవు ఎవరినుండీ మాటలు లేవు

హఠాత్తుగా ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రమణ మాట్లాడాడు.

"నీవు వచ్చిన కారణం వేరేవుంది. నాకు తెలుసు. మఱలా నాకు నీతిబోధలూ హితోపదేశాలూ చేయాలని వచ్చావ్."

"కాదు." అవకాశం కోసమే చూస్తున్న ఛాయ కంఠం ఖంగుమన్నది. "నీసాటి వాళ్ళంతా ఎంత సుఖంగా ఎంత ఆనందంగా వున్నారో గ్రహించేట్లుచేసి నీకు అసూయ కలిగించాలని వచ్చాను."

గంభీరహాసం నిలిచింది రమణ పెదవులపై.

"అసూయా ద్వేషాలూ, రాగ విరాగాలూ నన్ను ఏనాడో విసర్జించాయి ఛాయా. నీవు శ్రమపడి ప్రయోజనం లేదు."

బరువైన నిట్టూర్పు వెడలింది ఛాయ అంతరాళాల నుండి.

"నాకు తెలుసు రమణా, నీ హృదయం నవనీతమని. కానీ అర్థంలేని త్యాగాలతో ఎందుకిలా నిన్ను నీవు శిక్షించుకుంటున్నావ్? నీ త్యాగాలను అందుకొంటూన్న వారిలో ఎవరికయినా నీ విలువ తెలుసా? నీపై పిసమంత అనురాగం, మమతా ఉన్నాయా?"

"హుఁ" వైరాగ్యం కురిసింది అతడి చిరుహాసంలో, "ఆవేశపడి ప్రయోజనంలేదు ఛాయా. కొందరి జీవితాలు అలా అర్థరహితంగా సాగిపోవలసిందే."

"రమణా! నా హృదయంలో ఒక భాగం ఎల్లప్పుడూ నీ కోసం శోకించుతోంది." డగ్గుత్తిక మాటలకు అడ్డుపడింది.

"నీ మంచి హృదయంలో నాకు ఆ మాత్రం స్థానం లభించడం నా అదృష్టం కానీ, నా గురించి అనవసంగా నీ మనసు పాడుచేసుకోవలదని నా అభ్యర్థన."

మనసునందలి దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ కొద్ది సేపు మౌనం వహించిన ఛాయ, కూర్చున్న తావునుండి లేస్తూ ప్రకాశంగా అన్నది:

"వారికి ఇక్కడనుండి ట్రాన్స్ఫర్ అయ్యింది."

"విన్నాను."

"ఎల్లుండే ప్రయాణం, మళ్ళీ ఎప్పటికి కలుసుకుంటామో యేమో?"

"ఊఁ." అనలేక అంటున్న ఆ స్వరంలో అతడి మనసు మూలుగు ప్రతి ధ్వనించింది.

"ఎక్కడున్నా నా హృదయం నీ శ్రేయస్సు కొఱకూ, నీ క్షేమం కొఱకూ తహతహ లాడ్తుంటుందని మరచిపోకు."

"... ... ..."

"హితైషిగా, స్నేహితురాలిగా ఒక్క ప్రార్థన ఇప్పుడయినా మించిపోయింది లేదు. నీ బాధ్యతలన్నీ తీరాయి. ఇక తనకు మాలిన ధర్మం అనవసరం. నీకు తగిన సహచరిణిని ఎన్నుకొని జీవితంలో స్థిరపడినరోజు చూడాలని తపించుతున్నానని గుర్తుంచుకో."

"క్రొత్త అడ్రస్ తెలియజేయి. ఎల్లుండి స్టేషన్‌కు రాలేను."

"అడ్రెస్ వ్రాస్తాను అప్పుడప్పుడూ వస్తుంటావ్ గా?"

"అప్పుడప్పుడూ—ఎన్నోసార్లు వస్తానని చెప్పలేను గాని ఒక్కసారి మాత్రం తప్పక వస్తాను మీా వూరు."

"వెళ్తున్నాను."

పరిగెత్తినట్లే వడివడిగా నడచిపోయింది.

అతడికి తెలుసు—తన అశ్రుధారలు అతడికి కన్పించరాదనే అలా పారిపోయిందని.

# 15

'ఈరోజే ఛాయ వెళ్ళిపోతుంది. ఏమి చేయాలి? స్టేషన్‌కు వెళ్ళాలా, వద్దా?

వెళ్తే ఛాయ సంతోషిస్తుంది.

కానీ ఎందరో లెక్చరర్స్, విద్యార్థులూ కూడా వస్తారు స్టేషన్‌కు, సాగనంపటానికి.

అందులో కొందరు ఛాయకూ తనకూ గల స్నేహం తెలిసిన వారుంటారనేది సత్యం.

వారందరి ఎదుటా తాను తలెత్తుకోలేడు.

వారి విమర్శనా దృక్కులను ఎదుర్కోలేడు. కాని వెళ్ళకుంటే ఛాయ బాధపడదూ?'

మీమాంస ఎటూ తేలనే లేదు.

అంతలో "అబ్బాయ్" అంటూ తల్లి కేక విన్పించింది.

"ఏమిటమ్మా?"

"ఏముంది నాయనా?"

అతడి కుర్చీకి అల్లంత దూరంలో కాళ్ళు బారచాపుకొని తీరికగా మాటల కుపక్రమించింది.

"మా యిద్దరివీ ముసలి ప్రాణాలు. కాస్త మాటా మంతీ ఆడే వాళ్ళులేక, బిక్కు-బిక్కు-మంటూ పడివుంటున్నాము. మతులు పోతున్నాయి, నీమటుకు నువ్వు నాలుగు కాగితాలు ముందు పడవేసుకూర్చుంటావ్."

"నేను వ్రాయకపోతే ఎలా గడుస్తుందమ్మా మరీ? అన్నట్టు సుగుణా, సుగుణ పిల్లలూ వున్నారుగా? నీకు తోచక పోవడం ఏమిటీ?"

వింతగా, విసుగ్గా చూచింది మహాలక్ష్మి

"అయ్యో సంబడం." విరసంగా అన్నది. "వాళ్ళు వెళ్ళి అప్పుడే నాల్గు రోజులైంది. నీకింకా తెలియదన్న మాట! అంత గొప్పగా వున్నాయి ఈ యింటి ఆడపడుచుల మీద ప్రేమలు!"

నిర్ఘాంతబోయిన రమణ మాటలకు తడుముకోవలసి వచ్చింది.

"సుగుణ...సుగుణ వెళ్ళి..నాలుగు రోజులైందా? నాతో మాట మాత్రంగానైనా చెప్పలేదే?" ఆశ్చర్యం, బాధా పెనవేసుకు వచ్చాయి.

"ఎందుకు చెప్తుందీ? దానిమీద నీకు గల ప్రేమ అంత గొప్పగావుంటే, దానికేమవసరం మాట్లాడటానికీ? పురుళ్ళా, పుణ్యాలకు అందరి ఆడపిల్లలూ వచ్చినట్లే దాని పుట్టింటికి అది వచ్చిందిగానీ ఏమైనా గతిలేక వచ్చిందా?"

"నేనలా అన్నానా?" నీరసంగా అడిగాడు.

"అనక్కర్లేదు. 'మగపిల్లాడు పుట్టాడు. నాలుగైదు తులాల బంగారం తెచ్చి ఘనంగా వేడుక జరిపించ'మని పిచ్చి తల్లి నోరుతెఱచి అడిగినందుకైనా కాస్త ఖాతరుచేశావా? ముష్టి యిచ్చినట్లు రెండువేలు తెచ్చి అన్నీ అందులోనే జరుపుకొమ్మని ఖచ్చితంగా చెప్పాక, దాని మనసు బాధ పడదూ మరి?"

"అమ్మా!!!"

"ఆడాళ్ళన్నాక అన్నదమ్ముల పెట్టుపోతలపై ఆ మాత్రం ఆశలుండవా? ఇంటి ఆడపడచులు తృప్తిగా, సంతోషంగా పుట్టింటినుంచి వెళ్ళడం నీకే క్షేమం. అది పుట్టింటికే మంచిది. తెల్సుకో."

తల తిరిగిపోసాగింది రమణకు.

'నీ త్యాగాలను అందుకొంటూన్న వారిలో ఎవరి కైనా నీ విలువ తెలుసా? నీపై పీసమంత అనురాగం, మమతా వున్నాయా!'

ఛాయ మాటలు చెవులలో గింగురు మనసాగాయి.

మహాలక్ష్మి ధోరణి సాగిపోతోనే వుంది.

"ఆ పూరికొంపకు వచ్చి నేను వుండలేనని రాధ వ్రాసింది. ఇద్దరు కూతుళ్లూ అల్లుళ్ళూ వస్తే నాల్గురోజు లుండే జాగాలేదు, ఈ బెత్తెడు కొంపలో. కాస్త పెద్ద యిల్లు చూడమంటే నువ్వు వినవు."

ఒక్కొక్క మాటా రమణ ఎదలో ఎన్నెన్ని తూట్లు చేస్తున్నదో ఆమె కనవసరం.

"పాత అప్పులు తీరకండానే క్రొత్తఅప్పులు చేశాను. అవి తీర్చటానికే రాత్రింబవళ్ళూ విరామం లేకుండా వ్రాస్తున్నాను. మంచి యిల్లు తీసుకోవాలని నాకూ వుంది కాస్త ఈ అప్పులు తీరాక చూద్దాంలే."

"మాటకుముందు ఈ చాట భారతం వినలేక ఛస్తున్నాను. నువ్వు కట్నం తీసుకుని పెళ్ళి చేసుకుంటే అన్ని కష్టాలూ తీరతాయని చెప్తున్నానా? ఈ రోజు కూడా ఆ ఎదురింటావిడ ఎవరిదో సంబంధం గురించి చెప్పింది."

"ఈ ప్రస్తావన నావద్ద తేవద్దని చాలాసార్లు చెప్పానమ్మా. ఈరోజు ఆఖరుసారిగా చెప్తున్నాను. నేను సంపాదించి నంతలో మిమ్మల్ని లోటులేకుండా చూడగలను. తృప్తిపడటమనేది మన మనసులలో వుండాలి" నిష్కర్షగా అన్నాడు.

ఎక్కుపెట్టిన బాణంలా రంయ్యిన లేచి నిలబడింది మహాలక్ష్మి.

"అయితే నా మాట కూడావిను. పిల్లాపాపా, కళాకాంతీలేని ఈ కొంపలో నేను పడుండలేను. రెండు నెలలకో సారైనా నా కూతుళ్ళనూ, మనుమలనూ చూచుకోకుండా నేను బ్రతకలేను. ఈ చాలీ చాలని కొంపకు వాళ్ళు రారు."

నివ్వెరపాటుతో చూడసాగాడు రమణ.

"నన్నేం చెయ్యమంటావమ్మా"

"నువ్వేం చెయ్యనక్కర్లేదురా" తండ్రి వచ్చాడు అపరిమితమైన ఆగ్రహం వ్యక్తం చేస్తూ. "మేమే పోతున్నాం. సుగుణది ఒంటరి కాపురం. దాన్నీ, దాని బిడ్డలనూ చూచుకుంటూ హాయిగా అక్కడే వుండిపోతాం. రాధ కూడా అక్కడకు దగ్గరిలోనే వుంది. ఇద్దరి దగ్గరా మాకు కాలక్షేపమై పోతుంది."

అది కేవలం బెదిరింపు కాదు.

ఆ నాలుగోనాడే మహాలక్ష్మి, దేవయ్యా వెళ్ళిపోయారు.

"ఇంత బ్రతుకూ బ్రతికి, అల్లుళ్ళ యింటపడి తిన్నామని అనిపించుకోలేం. నెలనెలా అయిదారొందలు పంపిస్తాండు. అదనపు ఖర్చులువుంటే రాస్తాను, అశ్రద్ధ చేయక పంపిస్తూండు." అని ఆజ్ఞ జారీ చేశాడు దేవయ్యా వెళ్తూ వెళ్తూ.

"అనవసరంగా వెళ్తున్నారమ్మా. నేను చేసిన పొరపాటేమీ లేదు" ఎలాగో గొంతు పెగుల్చుకుని అన్నాడు రమణ.

"ఇక ఆ మాటలన్నీ ఎందుకులే" మూలిగింది మహాలక్ష్మి. "నీకేముంది, ఒంటిగాడివి. ఎలాగైనా జరిగిపోతుంది. ఓపికవుంటే నాలుగుగింజలు ఉడకేసుకో, లేకుంటే హోటేళ్ళు వుండనే వున్నై గదా! డబ్బు పంపడం ఆలస్యం చేయకు నెల నెలా, అల్లుళ్ళ దగ్గిర అప్రతిష్ట కాగలదు." అంటూనే బండి ఎక్కింది.

నిర్జీవంగా నిలబడిపోయిన ఒంటరి ప్రాణి రమణ అంత రంగపు ఆవేదన వర్ణనాతీతం.

'వెర్రివాడా! ఇంకెవరికోసం నీ శ్రమ? ఇటువంటి వాళ్ళంతా నీవాళ్ళా? ఇక నీకు వేళా పాళా తిండి సదుపాయం చూసే దెవరు? ఖర్మజాలక మంచానపడితే మందునీళ్ళు కాదు సరికదా, గుక్కెడు మంచినీళ్ళైనా గొంతుకలో పోసే దిక్కున్నదా?'

ఉస్సురనుకుంటూ ఎదుటి చెట్టు చేమల పైకి దృష్టి మరలించాడు.

పచ్చని బాదం చెట్టునిండా పక్షులు కిలకిల మంటు న్నాయి. క్రిందరాలిన కాయల్ని చిన్నపిల్లలు పోటాపోటీలుగా ఏరుకుంటున్నారు.

ఇంటి ముంగిటవున్న పెద్ద మర్రిచెట్టు నీడన ఇద్దరు ముగ్గురు వ్యక్తులు విశ్రాంతిగా పడుకొని వున్నారు.

ఆ చెట్టునీడన అనుదినం అలా ఎందరో బాటసారులు సుఖంగా సేదదీరడం జరుగుతూనే వున్నది. ఆ తరు శాఖలలో నిత్యం పక్షుల కలకలా రావాలు విన్పిస్తూనే వుంటాయి.

మరికొంచం దూరంలో పెద్ద మామిడిచెట్టు ఇటీవలి గాలివానకు కూలిపోయింది. రెండ్రోజులుగా ఆ చెట్టును ముక్కలు కొట్టించి కలప అమ్ముతున్నాడు దాని యజమాని.

రోజూ చూచే ఈ సామాన్య దృశ్యాలు రమణ కంటికి నేడు ప్రత్యేకంగా కన్పించాయి.

మొన్నటివఱకూ అనేకులకు ఫలదానం చేసి, తన ఛాయలో ఆశ్రయమిచ్చి ఆదుకొన్నది ఆ మామిడిచెట్టు. నేడు చనిపోయిన ఆ చెట్టువలన కూడా లబ్ధి పొందుతున్నారు దాని నీడన బ్రతికినవారే.

మరికొంతకాలానికి ఈ బాదంచెట్టూ, ఆ మర్రిచెట్టుల గతికూడా అంతే కావచ్చు!

తాను ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కూడా నిశ్చలంగా నిలచి అనేకమందికి నీడనూ, ఆశ్రయాన్నీ ఇచ్చే తరువుకు నీడనూ, ఆశ్రయాన్నీ ప్రసాదించగల వారెవరు? విషణ్ణమైన మనసు విరక్తిగా నవ్వుకొన్నది.

## 16

"అమ్మగారూ, అమ్మగారూ."

కొంపలంటుకు పోతూన్నట్టే అరుస్తూ పరుగునవచ్చింది పనిమనిషి.

అప్పుడే తెలతెలవారుతోంది.

ఇంకా పూర్తిగా వెలుగు రాలేదు.

"ఏమిటే గోలా?" విసుగ్గా అన్నది ఛాయ.

గుమ్మం కడిగి ముగ్గువేయడానికి వెళ్ళిందేమో—

ఓ చేతిలో చీపురూ, మరోచేతిలో ముగ్గుగిన్నె అలానే వున్నాయి.

"మరేం అమ్మగారూ—స్వాములారండీ..." మాటలు ఎక్కడా పూరించ నీయడంలేదు ఆవేశం.

"ఆఁ, తెల్లారిలేస్తే అనేకమంది సాములూ, సాధువులూ. పనేముంది ? ఇంత ప్రొద్దున్నే ముష్టి ఏమిటి ? వెళ్ళమను." నిద్రలేచిన పాపను భుజాన వేసుకుంటూ అన్నది ఛాయ.

"ముష్టి కాదమ్మగారూ. ఆయన చాలా గొప్ప సాధుగారు. మొన్న మా పిల్లోడికి జొరంవస్తే ఆయనకాడికి తీసికెళ్ళానా, మద్దేనానికి చేత్తో తీసేసినట్టే తగ్గిపోయింది. మా పిల్లోడేటి—ఎందరి రోగాలు నయమైనా యనుకున్నారు? వారం రోజులుగా శివాలయం కాడ మర్రిచెట్టుకింద వుంటున్నాడు మహానుభావుడు."

"అయితే ఏమంటావే ?"

"పాపగారికి పదిరోజుల్నుండీ జొరం తగ్గడంలేదు గదమ్మగారూ. ఆయన కాడికి తీసుకెళ్దాం పదండి."

"చాల్లే. ఇటువంటివి ఎన్ని వినలేదు! డాక్టరు మందు ఇస్తూనే వున్నాడుగా ?"

"లేదమ్మగారూ. నామాట అబద్ధంగాదు. అయినా ఒక్కసారి ఎళ్తే మీ సొమ్మేం పోయింది చెప్పండి ?"

అంతలో పాప వాంతి చేసుకోవడంతో ఆ మాటలు

కాస్త ఆగాయి. వాంతి చేసుకున్న పాప బిగ్గఱగా ఏడుస్తోంది.

నాల్గు నిముషాల తర్వాత అక్కడ కడుగుతూ పైడెమ్మ మళ్ళా ప్రారంభించింది.

"మీరు బాగా సమాకున్న అమ్మలే గావచ్చు. అయితే నేం ఈ ఒక్కపాలికీ నా మాట ఇనుకోండి. అందరు సాములార్లకు మల్లే ఈయన పూజలుయ్యా సెయ్యరు. పువ్వులూ, ఇబూతీ ఇవ్వరు. అసలు మనేపు సూడరు. మాట్లాడరు. ఆయన లోకం ఆయనది. ఒక్కసారి ఆయన ఎదుటికి ఎళ్తేనే మన రోగాలు అలా అలా దిగమారిపోతాయి."

ఈసారి ఛాయకు కొద్ది ఆసక్తి కలిగింది.

"అలాగా?" అన్నది, కొంత ఆశ్చర్యంగా.

"ఔనమ్మా. పదండి. నేను సాయంబత్తాను. ఇల్లిప్పుడే ఆయన నదికి తానానికి ఎళ్తుంటే సూశాను. లగెత్తుకొచ్చాను. ఊఁ. పదండి."

ప్రభాకరం గదిలోనుంచి అంతా వింటూనే వున్నాడు.

ఛాయ అతడి వద్దకు వచ్చింది.

"అంతా వింటున్నారుగా?" అన్నది.

"ఊఁ."

"పోనీ, ఒక్కసారి వెళ్తే ఏం పోయింది? చూద్దామా?"

"ఎంత చదువుకున్నా ఆడవాళ్ళు ఆడవాళ్లే!"

"కాదులెద్దురూ. పదిరోజులుగా పాప అలా అస్వస్థ తగావుంటే నాకు మతి పోతోంది. మనక్కావలసింది పాప ఆరోగ్యంగానీ తర్కం కాదుగా?"

"ఔననుకో."

"కొంచం సాయంరండి. ఎప్పుడూ అటువంటి చోట్లకు వెళ్ళలేదు నేను. బెరుగ్గా వుంటుంది."

"నడు. తప్పేదేముందీ?"

అక్కడ పాతిక ముప్పైమంది వఱకూ జనం వున్నారు.

"పొద్దెక్కిన కొద్దీ జనం ఎక్కువై పోతారు." పైడమ్మ కామెంటరీ సాగుతూనే వుంది.

"నదిలో తానమాడి వచ్చి ఈ సెట్టుకింద కూసుంటారు. ఎవ్వరితో మాటాడరు. ఆయన అన్నం తినగా వొవురూ సూడలేదు. ఏయమ్మో తెచ్చిన ఓ గ్లాసు పాలో మజ్జిగో మాత్రం పుచ్చుకుంటారు..."

స్వామీజీ గుణగానం చేస్తోన్నారు పైడమ్మతో పాటు మరికొందరు ఆగంతకులు.

స్వామికి దగ్గఱగా ఎదురుగా పాపను పట్టుకు నిలబడింది ఛాయ, అతడినే భక్తిగా చూస్తూ.

ఏదో తప్పక వచ్చినట్టుగా వచ్చిన ప్రభాకరం అల్లంత దూరంలో నిలబడ్డాడు.

"అబ్బ, ఎవరైనా చూస్తే నవ్వుతారు ఛాయా మూఢ నమ్మకాలని. త్వరగా పోదాం పద."

"ఉండండీ. తీరా వచ్చాంగా?"

వచ్చిన అందరూ పండ్లూ పువ్వులూ అతడి చెంత వుంచి, పాదాలకి మొక్కి వెళ్తున్నారు.

అతడు వాటినిగానీ, వారినిగానీ కన్నెత్తి చూడటం లేదు.

"స్వామీజీ" వణకుతూన్న కంఠంతో సంబోధించింది ఛాయ.

ఆమె సాహసానికి కొందరు ఆశ్చర్యంగా అబ్బురంగా చూచారు. మరి కొందరు "తప్పు తప్పు. మాట్లాడకూడదు. ఆయనకు కోపం రావచ్చు." అని వారించారు.

అయినా ఛాయ వినలేదు.

మరొక్క అడుగు ముందుకు వేసింది.

"స్వామీజీ. ఒక్కసారి ఇటు చూడండి."

అంతవఱకూ అవనతంగా వున్న స్వామి కనురెప్పలు పైకిలేచాయి.

అతి నిర్మలమైన ఆ చూపులు ఛాయ వదనంపై అలా నిశ్చలంగా నిలచిపోయాయి కొన్ని నిముషాలు.

"స్వామికి కోపం వచ్చింది."

"రాదా మరి ?"

జనంలో ఊహాగానాలు మొదలయ్యాయి.

స్వామి దృష్టులు ఛాయపై నుండి మెల్లగా పాపపైకీ, కొద్ది ఎండగా నిలబడిన ప్రభాకరం మీదికీ ప్రసరించాయి.

'దగ్గరకు ర'మ్మన్నట్లుగా చేతితో ఛాయకు సూచించాడు.

బెదురుతూన్న చూపులతో, తడబడే అడుగులతో అతడి సమీపానికి చేరి నిలబడింది ఛాయ.

జనంలో కలకలం తారస్థాయి నందుకున్నది.

కారణం-అతడిన్ని రోజులుగా ఎవ్వరినీ చూచినదిగానీ, ఎవరితోనూ మాట్లాడినదిగానీ లేదు

స్వామి ఛాయను నిశ్చలదృష్టితో పరికించి, శిశువును దయాపూరిత నేత్రాలతో వీక్షించాడు.

అతడి ఫాల తలముపై ఏదో భావం కదలిపోయింది. పిదప, శిశువు మస్తకంపై దక్షిణ హస్తముంచి ధీర గంభీర స్వరంతో "చిరంజీవినిగా వర్ధిల్లు, నీ జనని వలెనే విద్యావతివీ, విశాలహృదయినివీ, ఉత్తమ స్త్రీవి అగుదువుగాక!" అని ఆశీర్వదించాడు.

అతడికి మనఃపూర్వకంగా నమస్కరించి, కదలలేక కదలి, సాగిపోయింది ఛాయ స్వగృహానికి.

"అమ్మో అమ్మో, ఎవరితో మాటాడని సాములారు మా అమ్మగారితో మాట్లాడారు" అని గుండెలు బాదు కున్నది పైడమ్మ.

"ఆ పాపలో ఏమి దైవాంశమున్నదో! స్వామి మౌనం వదలి ఆశీర్వదించారు!" అని వింతగా చెప్పుకున్నారు జనం.

"ఆశ్చర్యంగానే వుందే. ఎవరితో మాట్లాడని స్వామీజీ మనకు ఆశీర్వాదమీయడం!" అన్నాడు ప్రభాకరం తిరిగి వచ్చే దారిలో.

ఛాయ మాట్లాడలేదు.

"నీకు వింతగా లేదూ?" ప్రభాకరం రెట్టించాడు.

ఛాయ మెల్లగా అన్నది. "అతడు మన రమణ!"

"ఆఁ!!!"

"ఔను."

"ఎక్కడో చూచిన ముఖంలా అన్పించింది సుమా నాకు. అయితే గుర్తువచ్చింది కాదు. మరి అలా వదిలేశా వేమిటి? ఛఛఛ, పాపం, మన యింటికి తీసుకువద్దాం."

ఆవేశంగా అంటూ వెనుదిరిగి వెళ్ళబోతూన్న అతడిని ఛాయ ఆపుచేసింది.

"ప్లీజ్, వద్దు, వదిలి వేయండి."

"ఛాయా! నువ్వేనా అలా మాట్లాడుతున్నావు?"

"హుఁ. నేనే. కనీసం ఈ మార్గంలో నయినా ఆ దురదృష్ట జాతకుడికి మనశ్శాంతి లభించాలని కోరుకుందాం."

ఆ తరువాత ఆ స్వామీజీ ఆ వూరిలోగానీ, పరిసరాలలోగానీ ఎవ్వరికీ కన్పించలేదు. అతడి విశేషాలుగానీ వివరాలుగానీ ఎవరికీ తెలియవు.